# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 24-7-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:274 పేజిలు:6 వెల: రూ.1/-


**నేటి కందం-నేటికి అందం**

కెనడా దేశముతో జరి
పిన చర్చలు ఫలముల నిడి వేవిధములుగా
ననతేనియ నిరువురి కిడి
తనరెడి వాణిజ్యమునకు దారులు తీసెన్ !!

(కెనడా దేశంతో భారత దేశం జరిపిన వాణిజ్య చర్చలు ఫలవంతం అవడంతో రెండు దేశాలకు ఇవి లాభదాయకంగా ఉంటాయని రెండు దేశాల లోని ప్రజలు హర్షం వ్యక్తంచేశారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

సమస్యలే ప్రశ్నలై
సాగుతున్న తరుణం
అహంతోని అణిచేస్తే
అధికారమే మరణం.
ప్రభుత్వాలు ఏవైనా
పరిష్కార దూరదృష్టి
విస్మరిస్తే తప్పదింకా
విప్లవోద్యమాల సృష్టి



-వేల్పుల నారాయణ
9440433475

# హుస్నాబాద్‌లో పొన్నం కీలక సమావేశం




మెదక్, జులై 23:ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొనే వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని హుస్నాబాద్ నియోజక వర్గంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో సిద్ధిపేట జిల్లా కలెక్టర్ హైమవతి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి, ఆయా జిల్లాల అదనపు కలెక్టర్లు, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తాగునీటి సరఫరా, సాగునీటి నిర్వహణ, పశుగ్రాసం, చెరువుల్లో నీటి నిల్వలు, ఇతర అత్యవసర చర్యలపై సమీక్ష నిర్వహించారు. తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రౌండ్ వాటర్ పెంపునకు ఇంకుడు గుంతల తవ్వకం, రైతులు ఆరుతడి పంటలు, ఆయిల్ ఫామ్ సాగు చేపట్లేలా అవగాహన కల్పించాలని సూచించారు.

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని, అవసరమైన వనరులను సిద్ధంగా ఉంచాలని సమావేశంలో నిర్ణయించారు.

# చాలా అంశాల్లో మంత్రులు వెనకబడిపోతున్నారు.. ఏపీ కేబినెట్ భేటీలో సీఎం



అమరావతి, జులై 23: రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో మంత్రులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక సూచనలు చేశారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో 3,120 పోస్టుల భర్తీకి సంబంధించి కేబినెట్ ఆమోదం కోసం వచ్చిన ప్రతిపాదనను మరోసారి అధ్యయనం చేయాలని ఆదేశించారు. అవసరమైన ఉద్యోగాలు కోసం మరోసారి అధ్యయనం చేసి ప్రతిపాదనలు పంపాలని కోరారు. మంత్రులు తమ శాఖల పనితీరుపై మరింత దృష్టి సారించాలని సీఎం సూచించారు. చాలా అంశాల్లో మంత్రులు వెనుకబడిపోతున్నారని సీఎం అన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించిన తర్వాత, ఆ అంశంపై ఎమ్మెల్యేలు, మంత్రులు బాధ్యత తీసుకుని ప్రజలకు వివరించాలని ఆదేశించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, కలెక్టర్ కలిసి పనిచేస్తే అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, ఇద్దరూ కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు.

రాష్ట్ర పెట్టుబడి ప్రోత్సాహక మండలి(రాఎఖః)లో ఆమోదం పొందిన ప్రాజెక్టులను జిల్లా స్థాయిలో సమీక్షించాలని సీఎం ఆదేశించారు. అలాగే ప్లానింగ్ బోర్డు సమావేశాలను తరచూ నిర్వహిస్తూ, అభివృద్ధి పనులపై క్రమం తప్పకుండా సమీక్షలు చేయాలని సూచించారు. 'మీ శాఖల్లో ఉన్న సమస్యలను మీరే పరిష్కరించే విధంగా చొరవ చూపాలి. రెండేళ్ల ప్రభుత్వ విజయాలపై మంత్రులు మీడియా సమావేశాలు నిర్వహించినప్పటికీ, వాటిని ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లలేకపోయారు' అని చెప్పుకొచ్చారు.

పలాసలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడికి సంబంధించిన ఘటన, తిరుపతిలో ఆంజనేయస్వామి విగ్రహం చోరీ కేసుల్లో సీసీటీవీ కెమెరాల ఆధారంగా నిందితులు దొరికిపోయారని ముఖ్యమంత్రి చెప్పారు. డీఎస్సీ పరీక్షల అంశంలో ప్రతిపక్షం చేసిన ఆరోపణలను ప్రజలు నమ్మలేదని, కోర్టులోనూ వారికి అనుకూల ఫలితం రాలేదని వ్యాఖ్యానించారు. ఈ అంశాన్ని ఢిల్లీలో జరిగిన నీట్ ఉద్యమంతో ముడిపెట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఇలాంటి అంశాల్లో మంత్రులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గోదావరి పుష్కరాలు, పోలవరం ప్రాజెక్టు ప్రారంభోత్సవాన్ని ఒకే రోజు నిర్వహించే అంశంపై కేబినెట్‌లో చర్చ జరిగింది. పోలవరం ప్రాజెక్టు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని సీఎం పేర్కొన్నారు. పోలవరం ప్రారంభోత్సవం, గోదావరి పుష్కరాల ప్రారంభ కార్యక్రమాలను విడివిడిగా నిర్వహిస్తే బాగుంటుందని మంత్రి

# ప్రజాస్వామ్యానికి ప్రతీకగా శాసనసభను మరింత ఆధునికంగా తీర్చిదిద్దాలి: సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, జులై 23: తెలంగాణ శాసనసభ భవనంలో కొనసాగుతున్న మరమ్మతు పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం పరిశీలించారు. ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలిచిన శాసనసభ ప్రాంగణాన్ని మరింత మెరుగైన మౌలిక సదుపాయాలతో తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టిన పనుల పురోగతిని ఆయన అధికారులతో సమీక్షించారు.


ఈ సందర్భంగా శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, జైవీర్ రెడ్డి తదితరులు ముఖ్యమంత్రితో కలిసి మరమ్మతు పనులను పరిశీలించారు.

పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిర్దేశించిన గడువులోగా అన్ని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. శాసనసభకు వచ్చే ప్రజాప్రతినిధులు, అధికారులు, సందర్శకులకు మెరుగైన వసతులు కల్పించేలా అన్ని ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రజాస్వామ్యానికి ప్రతీక అయిన తెలంగాణ శాసనసభ ప్రాంగణాన్ని మరింత మెరుగైన మౌలిక సదుపాయాలతో తీర్చిదిద్దేందుకు చేపట్టిన పనులు వేగంగా, నాణ్యతతో పూర్తయ్యేలా అధికారులను ఆదేశించాను" అని తెలిపారు. శాసనసభ భవనం ఆధునిక అవసరాలకు అనుగుణంగా ఉండేలా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు.

# భారత్‌ను భయంతో కాదు.. ప్రజాస్వామ్యం, రాజ్యాంగంతో నడపాలి: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, జులై 23: యువత గొంతు నొక్కితే బీజేపీ రాజకీయ పతనం తప్పదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. ఈరోజు(గురువారం) మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని భయపెట్టలేరని.. రాజ్యాంగాన్ని అణచలేరన్నారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా నిర్బంధాలు సరికాదని అన్నారు. ఉద్యోగాలు అడిగిన యువతకు లాఠీలు, కేసులే బీజేపీ సమాధానమనమంటూ విమర్శలు గుప్పించారు. ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కే అని చెప్పుకొచ్చారు. విద్యార్థుల స్వరాన్ని అణచివేయడం ప్రజాస్వామ్యానికి ముప్పని వ్యాఖ్యానించారు.



యువత భవిష్యత్తుపై కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మంత్రి విమర్శించారు. విద్యార్థుల మధ్య నిలిచిన రాహుల్ గాంధీ నిజమైన ప్రజానాయకుడన్నారు. ప్రజల మధ్య ఉండే నాయకత్వానికే దేశం మద్దతిస్తుందని తెలిపారు. భయపెట్టి ప్రజల స్వరాన్ని శాశ్వతంగా అణచలేరని అన్నారు. విద్యార్థుల కలలను సంకెళ్లతో బంధించలేరని స్పష్టం చేశారు. యువత ఆశయాలను జైళ్ల గోడల మధ్య నిర్బంధించలేరన్నారు. రాజ్యాంగాన్ని ఎవరూ ఓడించలేరని.. రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్ చారిత్రక బాధ్యత అని వెల్లడించారు. 'యువత విద్వేషం కాదు... విశ్వాసం కోరుకుంటోంది. అహంకారం కాదు... జవాబుదారీతనం కోరుకుంటోంది. ప్రచారం కాదు... పారదర్శక పాలననే యువత కోరుకుంటోంది' అంటూ వ్యాఖ్యానించారు.

2029 ఎన్నికలు రాజ్యాంగ పరిరక్షణకు కీలకమని ఉత్తమ్ వెల్లడించారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రత్యామ్నాయం అందిస్తోందన్నారు. తెలంగాణలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన అందిస్తోందని తెలిపారు. ప్రజల గొంతు వినే ప్రభుత్వాలే చరిత్రలో నిలుస్తాయన్నారు. 'భారత్‌ను భయంతో కాదు.. ప్రజాస్వామ్యం, రాజ్యాంగంతో నడపాలి' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.

# నీట్ పేపర్ లీకేజీపై చర్చిద్దాం రండి..

## సీజేపీతో నేతలను చర్చలకు ఆహ్వానించిన కేంద్రం




న్యూ ఢిల్లీ, జులై 23:నీట్ పేపర్ లీకేజీ అంశంపై ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో ఇంకా నిరసన ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఈ అంశంపై సీజేపీ నేతలతో చర్చించేందుకు సిద్ధమని ప్రకటించింది. కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి జితేంద్ర సింగ్ గురువారం సీజేపీ నేతలను చర్చలకు ఆహ్వానించారు.

పేపర్ లీకేజీ అంశంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, నీట్ యూజీ పరీక్షలో అవకతవకలపై కఠిన చర్యలు తీసుకుంటామని జితేంద్ర సింగ్ మీడియాకు తెలిపారు. సీజేపీ నేతలతో చర్చించేందుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ప్రభుత్వం ఈ విషయంలో సిద్ధంగా ఉందన్నారు. కేంద్ర మంత్రి జేపీ నడ్డా ఆఫీసు లేదా ఇంటి వద్ద.. ఎక్కడైనా సీజేపీ నేతలకు అనుకూలమైన చోట చర్చలు జరుపుతామన్నారు. ఈ సమస్యకు పరిష్కారం కోసం ప్రయత్నిస్తామన్నారు. ఇది దేశంలోని విద్యార్థుల కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్య అని, చర్చలకు సహకరించాలని కోరారు. నిరసన చేస్తున్న విద్యార్థుల్ని కలిసేందుకు సిద్ధమన్నారు. చర్చల కోసం కేంద్ర ప్రభుత్వ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని, విద్యార్థులకు అనువైన చోట చర్చలు జరుపుతామని స్పష్టం చేశారు.

నేతల్ని, విద్యార్థుల్ని కలిసి చర్చించడం ద్వారానే దీనికి పరిష్కారం లభిస్తుందన్నారు. మరోవైపు సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్వల్ప అనారోగ్యానికి గురయ్యారు. తాను జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నానని, ఈ రోజు నిరసనకు హాజరు కాలేనని సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేశారు. కొన్ని గంటలు విశ్రాంతి కావాలని, కోలుకుంటానని తెలిపారు. సాయంత్రానికల్లా నిరసన వేదిక వద్దకు తిరిగి వస్తానని వెల్లడించారు.

# 'దేశంలో విద్యావ్యవస్థ భ్రష్టుపట్టింది'.. విద్యార్థుల నిరసనలకు కమల్ హాసన్ సంఘీభావం

న్యూ ఢిల్లీ, జులై 23: దేశవ్యాప్తంగా నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలపై నిరసనలు వెల్లువెత్తుతున్న వేళ ప్రముఖ నటుడు, మక్కల్ నీది మైయమ్ పార్టీ అధ్యక్షుడు కమల్ హాసన్ విద్యార్థులకు తన మద్దతు ప్రకటించారు. 'కాక్రోచ్ జనతా పార్టీ' చేపట్టిన ఆందోళనలకు సంఘీభావం తెలుపుతూ 'ఎక్స్'లో ఆయన ఒక పోస్ట్ చేశారు. ప్రస్తుత విద్యావ్యవస్థ భ్రష్టుపట్టిందని, దేశం తన బిడ్డలను నిరాశపరిచిందని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు.

'ఒక చిన్నారి బాధపడినప్పుడే మనం స్పందించి ఉండాల్సింది. కానీ అనేక మంది ప్రాణాలు కోల్పోయే వరకు వేచి చూశాం. బోధన స్థానాన్ని కోచింగ్, జిజ్ఞాస స్థానాన్ని ఆందోళన, ప్రతిభ స్థానాన్ని నేరాలు ఆక్రమించుకున్న ఈ వ్యవస్థ పూర్తిగా కుళ్లిపోయింది. విద్యార్థులకు సమాధానాలకు బదులు బారికేడ్లు, లాఠీలు ఎదురైనప్పుడు ఆ దేశం విఫలమైనట్లే' అని కమల్ హాసన్ ఘాటుగా విమర్శించారు. సీజేపీ ఆధ్వర్యంలో 'చలో సంసద్' యాత్ర చేపట్టిన విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు లాఠీఛార్జ్ చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించడం లాంటి పరిణామాల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

జూన్ 28 నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న విద్యావేత్త సోనమ్ వాంగ్‌చుక్‌ను ఉద్దేశించి.. 'ముందుకు సాగాల్సిన ప్రయాణంలో దేశానికి మీ అవసరం ఎంతో ఉంది. దయచేసి మీ దీక్షను విరమించండి' అని కమల్ విజ్ఞప్తి చేశారు. అనంతరం భారతీయ విద్యార్థులను ఉద్దేశించి.. 'మీరే మాలో అత్యంత ఉత్తములు. మీ కర్తవ్యాన్ని మీరు నిర్వర్తించారు. ఇప్పుడు దేశం తన బాధ్యతను నెరవేర్చాల్సిన సమయం వచ్చింది' అని వ్యాఖ్యానించారు. కాగా, ఇప్పటికే ఈ నిరసనలకు నసీరుద్దీన్ షా, ప్రకాశ్ రాజ్, సల్మాన్ ఖాన్, మాధవన్, షబానా అజ్మీ, రాజ్‌కుమార్ రావు తదితర సినీ ప్రముఖులు మద్దతు తెలిపారు. తాజాగా కమల్ హాసన్ సైతం విద్యార్థులకు మద్దతు నిలిచారు.

# విద్యార్థులకు విద్యతో పాటు చదవడం, రాయడం నేర్పించాలి.. పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



కరీంనగర్, జులై 23: (నేటినిజం ప్రతినిధి) విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు చదవడం, రాయడం నేర్పించాలని పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. పెద్దపల్లి జిల్లాలో ప్రభుత్వ సేవలు నాణ్యతప్రమాణాలు, జవాబుదారీతనం పెంపుపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు గురువారం పెద్దపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి, రాగినేడు, బొంపల్లి గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు చదవడం, రాయడం వంటి ప్రాథమిక నైపుణ్యాలు అందేలా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అంగన్‌వాడీల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సకాలంలో అందించాలని సూచించారు. పీహెచ్‌సీలలో వైద్య సేవల నాణ్యతను మెరుగుపరచాలని, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు నాణ్యతతో అందేలా పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.

# నీట్ వివాదంపై 26న ఉమ్మడిగా నిరసన ర్యాలీ.. ఉద్ధవ్, రాజ్ ఠాక్రే ప్రకటన

ముంబై, జులై 23: నీట్ వివాదంపై జూలై 26న ఉమ్మడిగా నిరసన ర్యాలీ చేపడతామని శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ ఠాక్రే ప్రకటించారు. తమ శాంతియుత నిరసనను భగ్నం చేసేందుకు ప్రయత్నించే వారిని చితకబాదుతామని రాజ్ ఠాక్రే హెచ్చరించారు. నీట్ పేపర్ లీక్ వివాదంతో పాటు ఢిల్లీలో నిరసన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల చర్యకు వ్యతిరేకంగా శివసేన (యూబీటీ), ఎంఎన్ఎస్ ఆధ్వర్యంలో ఉమ్మడిగా నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు ఇద్దరు నేతలు గురువారం తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆవేదన తెలియజేయడానికే ఈ నిరసన ర్యాలీ చేపడుతున్నట్లు వివరించారు.

కాగా, జూలై 26న తలపెట్టిన ఈ ఉమ్మడి నిరసన గురించి లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో తాను మాట్లాడినట్లు ఉద్ధవ్ ఠాక్రే తెలిపారు. మహారాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కూడా ఇందులో పాల్గొంటారని చెప్పారు. ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తోందని, అయితే విద్యార్థులు ఇకపై ఎవరికీ భయపడరని అన్నారు. 'విద్యార్థులపై దాడి చేసి, మహిళా నిరసనకారుల దుస్తులు చించిన పోలీసుల బాధ్యతను ప్రధానమంత్రి తీసుకుంటారా?' అని ప్రశ్నించారు.




# స్వీయ సంరక్షణతో సంపూర్ణ ఆరోగ్యం ?!

## (జూలై 24న "అంతర్జాతీయ స్వీయ సంరక్షణ దినోత్సవం" సందర్భంగా)

స్వీయ సంరక్షణ అనేది ఒక విలక్షణమైన ప్రక్రియ. దీని ద్వారా ప్రజలు, కుటుంబాలు, సమాజాలు, ఆరోగ్య సంరక్షణ నిపుణుల సహాయంతో లేదా వారి సహాయం లేకుండా, అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా తమ ఆరోగ్యాన్ని తాము ప్రోత్సహించుకోవడం, కాపాడుకోవడం, వ్యాధులను నివారించుకోవడం, అనారోగ్యాల కట్టడి చేసుకోవడం, వైకల్యాన్ని ఎదుర్కోవడం చేస్తారు. స్వీయ సంరక్షణ అంటే, ముఖ్యంగా ఒత్తిడి సమయాల్లో, ఒకరి సంతోషాన్ని, శ్రేయస్సును పద్ధతి ప్రకారం కాపాడుకోవడం. ఇది ఒక స్వయం నిర్ణయం తీసుకునే ప్రక్రియ, ఇది ప్రజలు తమ ఆరోగ్యాన్ని త్వరగా, సౌకర్యవంతంగా కాపాడుకోవడానికి వీలు కల్పిస్తుంది. అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలు స్వీయ సంరక్షణను ఏడు కోణాలలో నిర్వచిస్తున్నాయి. వీటినే ఆరోగ్య అక్షరాస్యత, మానసిక శ్రేయస్సు, శారీరక శ్రమ, ఆరోగ్యకరమైన ఆహారం, ప్రమాద నివారణ, మంచి పరిశుభ్రత, మరియు ఆరోగ్య సంరక్షణ ఉత్పత్తులు, సేవల బాధ్యతాయుతమైన ఉపయోగం అని గుర్తుంచుకోవాలి.

### అంతర్జాతీయ స్వీయ సంరక్షణ దినోత్సవం :

ప్రతి సంవత్సరం జూలై 24న ప్రపంచవ్యాప్తంగా "అంతర్జాతీయ స్వీయ సంరక్షణ దినోత్సవం (ఇంటర్నేషనల్ సెల్ఫ్-కేర్ డే)"ను జరుపుకుంటున్నాం. ఇది 24/7 నిరంతరాయంగా స్వీయ సంరక్షణ పాటించాల్సిన అవసరాన్ని సూచిస్తుంది. ఈ రోజు "అంతర్జాతీయ స్వీయ సంరక్షణ మాసం" (జూన్ 24 నుండి జూలై 24 వరకు) చివరి రోజు కూడా అని గమనించాలి. సమర్థవంతమైన స్వీయ-ఆరోగ్య నిర్వహణ వల్ల కలిగే ప్రయోజనాల గురించి ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడానికి ఇది ఒక ముఖ్యమైన అవకాశాన్ని కల్పిస్తుంది. "అంతర్జాతీయ స్వీయ సంరక్షణ ఫౌండేషన్" 2011లో "అంతర్జాతీయ స్వీయ సంరక్షణ దినోత్సవాన్ని" ఏర్పాటు చేసింది, అప్పటి నుండి ప్రతి సంవత్సరం జూలై 24న దీనిని పాటిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూ) కూడా స్వీయ సంరక్షణను ఆరోగ్య సంరక్షణ అందించడంలో ఒక కీలకమైన భాగంగా గుర్తిస్తుంది. మీడియా ద్వారా ఎక్కువ మందికి చేరుకోవడానికి, స్వీయ సంరక్షణ విలువ గురించి అవగాహన పెంచడానికి ఇది ఒక మంచి అవకాశం. ఈ రోజున, ప్రపంచవ్యాప్తంగా ప్రజలు తమ స్వీయ సంరక్షణ చర్యల గురించి ప్రజల జ్ఞానాన్ని పెంచడానికి, అవి ప్రజల జీవితాల్లో తెచ్చే ప్రయోజనాలను, ఇప్పటివరకు సాధించిన పురోగతిని సమీక్షించు కోవడానికి వేదికగా జరుపుకుంటారు.

### అంతర్జాతీయ స్వీయ సంరక్షణ దినోత్సవం-2026 ఇతివృత్తం:

ఈ సంవత్సరం 2026లో, "అంతర్జాతీయ స్వీయ సంరక్షణ దినోత్సవం" ఇతివృత్తంగా "స్వీయ సంరక్షణ మీ ఆరోగ్యాన్ని మీ చేతుల్లో ఉంచుతుంది: టెస్ట్, ట్రాక్, థ్రైవ్". ఇది ప్రజలు తమ ఆరోగ్య స్థితిని అర్థం చేసుకుని, ముందుస్తుగా చర్యలు తీసుకోవడానికి, క్రమం తప్పని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం, రోజువారీ అలవాట్లను గమనించుకోవడం పట్ల ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది. స్వీయ సంరక్షణ వ్యక్తులు మరింత ఆరోగ్యంగా ఉండటానికి, సమస్యలను నివారించడానికి, పూర్తి శ్రేయస్సును మెరుగుపరచడానికి సహాయపడుతుందని ఇది పునరుద్ఘాటిస్తుంది. ఈ రోజున, స్థానిక సంస్థల నుంచి అంతర్జాతీయ సంస్థలకు చెందిన వివిధ వ్యక్తులు స్వీయ సంరక్షణ వర్క్‌షాప్‌లను నిర్వహించడం, బ్లాగులు రాయడం, బహిరంగ సభలలో ప్లకార్డులను ప్రదర్శించడం, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో స్వీయ సంరక్షణ కిట్‌లు, విజన్ బోర్డులను సృష్టించి పోస్ట్ చేయడం మొదలైన వాటి ద్వారా ప్రజలకు స్వీయ సంరక్షణపై అవగాహన కల్పించడానికి దోహదపడతారు.

### స్వీయ సంరక్షణ దినోత్సవం యొక్క ముఖ్యమైన చర్యలు:

ఈ పవిత్రమైన రోజున, మన ఆరోగ్యాన్ని నెమ్మదిగా, స్థిరంగా మెరుగుపరుచుకోవడానికి చర్యలు ప్రారంభించాలని సంకల్పించుకుందాం. 30 నిమిషాలకు పైగా నడవడం, 3-4 లీటర్ల నీరు త్రాగడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, సుమారు 7 గంటలు నిద్రపోవడం, స్క్రీన్ సమయాన్ని తగ్గించుకోవడం, ధ్యానం లేదా యోగా వంటి విశ్రాంతినిచ్చే కార్యకలాపాలు, సానుకూల దృక్పథాన్ని పెంపొందించుకోవడం, శరీర పరిశుభ్రతను పాటించడం, క్రమం తప్పని ఆరోగ్య పరీక్షలు, స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు, సంగీతం వినడం, స్ఫూర్తిదాయక కథలు చదవడం, మెదడుకు పదును పెట్టే పజిల్స్ పరిష్కరించడం, ప్రతిరోజూ కొత్త విషయాలు నేర్చుకోవడం వంటి రోజువారీ చర్యలు ఇందులో ఉన్నాయి. ఈ స్వీయ సంరక్షణ కార్యకలాపాలు గుండె సంబంధిత ఆరోగ్యం, ఒత్తిడి తగ్గింపు, రోగనిరోధక శక్తిని పెంచడం, గ్రహణశక్తిని మెరుగుపరచడం, వ్యాధులను ముందుగానే గుర్తించడం, మంచి నిద్ర, ఆందోళన తగ్గింపు, భావోద్వేగ నియంత్రణ, మానసిక స్పష్టత వంటి ప్రయోజనాలకు మీకు సహాయపడతాయి.

### మానవీయ సంక్షోభాలు - మహమ్మారులు:

ప్రపంచవ్యాప్తంగా, ప్రధానంగా అల్ప మరియు మధ్య-ఆదాయ దేశాలలో, 430 కోట్ల మంది ప్రజలకు అవసరమైన ఆసుపత్రి ఆధారిత ఆరోగ్య కార్యకర్తల సేవలు సక్రమంగా అందడం లేదని నివేదికలు చెబుతున్నాయి. ప్రపంచ జనాభాలో 20 శాతానికి పైగా మానవీయ సంక్షోభాల బారిన పడుతున్నారు,

దీనివల్ల ఆరోగ్య వ్యవస్థలు అవసరమైన చికిత్సలను అందించడం కష్టతరం అవుతోంది. సాయుధ పోరాటాలు, కోవిడ్-19 వంటి మహమ్మారులు, వాతావరణ మార్పులు ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను ప్రభావితం చేసి, దానిపై ఒత్తిడిని పెంచుతున్నాయి.

ఈ చిన్న చిన్న కార్యకలాపాలను రోజూ పాటించడం వల్ల మన ఆరోగ్యాన్ని, దీర్ఘకాలిక శ్రేయస్సును అత్యంత ప్రభావవంతంగా కాపాడుకోవచ్చు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని మర్చిపోవద్దు. ఒక్క రోజుకే పరిమితం కాకుండా, దీర్ఘకాలం కొనసాగే ఈ అలవాట్లను పాటించండి.

గుర్తుంచుకోండి, స్వీయ సంరక్షణలో ఆరోగ్యకరమైన ఆహారం, క్రమమైన శారీరక వ్యాయామం, తగినంత నిద్ర, ఒత్తిడి నిర్వహణ మరియు ఆరోగ్య సంరక్షణ వనరులను బాధ్యతాయుతంగా ఉపయోగించడం వంటివన్నీ ఉంటాయి. ఈ స్వీయ సంరక్షణ పద్ధతులు అనారోగ్యాన్ని నివారించడంలో, దీర్ఘకాలిక వ్యాధులను నిర్వహించడంలో, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో మరియు ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలపై భారాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి.



-మధుపాళీ
9949700037

# కోల్ నీర్ ప్లాంట్ల ప్రారంభం, సవరించిన ఝరియా బృహత్ప్రణాళిక కింద నైపుణ్యాభివృద్ధి కోసం అవగాహన ఒప్పందం

న్యూఢిల్లీ, జులై 23:బాధ్యతాయుతమైన గనుల మూసివేత విధానాలను ప్రోత్సహించే దిశగా నిరంతర ప్రయత్నాలను కొనసాగిస్తున్న కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ.. 'ఆరోహ్ - గనుల మూసి వేతపై వార్షిక నివేదిక'ను 2026 జూలై 22న న్యూఢిల్లీలో విడుదల చేయనుంది. ఆమోదిత గనుల మూసివేత ప్రణాళికలకు అనుగుణంగా 42 బొగ్గు గనులను శాస్త్రీయ పద్ధతిలో మూసివేయడం స్వాతంత్ర్యానంతరం ఇదే మొదటిసారి. శాస్త్రీయ పునరుద్ధరణ, పర్యావరణ పునరుద్ధరణ, మైనింగ్ అనంతరం భూమి సుస్థిర వినియోగం, ప్రజా సంక్షేమ చర్యల ద్వారా గతంలో మైనింగ్ జరిగిన ప్రాంతాలను ఏ విధంగా ఉత్పాదకమైన రీతిలో పునర్వినియోగంలోకి తీసుకువచ్చారో ఈ నివేదిక వివరిస్తుంది.

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారు. కేంద్ర పర్యావ రణ, అటవీ, వాతావరణ మార్పు ల శాఖ మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్, కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ, భౌగోళిక విజ్ఞాన శాఖల సహాయ మంత్రి (స్వతంత్ర హోదా), పీఎంవో ? సిబ్బంది వ్యవహారాలు, ప్రజా ఫిర్యాదులు, పింఛన్ల శాఖ, - అణు ఇంధన విభాగం - అంతరిక్ష విభాగం సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రత్యేక అతిథులుగా హాజరవుతారు. అలాగే కేంద్ర బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి శ్రీ సతీశ్ చంద్ర దూబే గౌరవ అతిథిగా పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో బొగ్గు శాఖ కార్యదర్శి శ్రీ విక్రమ్ దేవదత్, బొగ్గు శాఖ అదనపు కార్యదర్శి శ్రీ సనోజ్ కుమార్ ఝా, కంట్రోలర్ శ్రీ సజీశ్ కుమార్. ఎన్, మంత్రిత్వ శాఖ ఉన్నతాధికా రులు పాల్గొంటారు.

గనికి సంబంధించిన దశల న్నింటిలో దాని మూసివేత అత్యం త కీలకమైనది. పర్యావరణ పున రుద్ధరణ, భూమి పునరుద్ధరణ, సామాజిక - ఆర్థిక ప్రయోజనాల కోసం మైనింగ్ అనంతరం ఆ ప్రాంతాలను ప్రయోజనకరంగా పునర్వినియోగంలోకి తీసుకురావ డం వంటి అంశాలు ఇందులో అంతర్భాగం. దీని ప్రాధాన్యాన్ని గుర్తించిన బొగ్గు మంత్రిత్వ శాఖ - బొగ్గు క్షేత్రాల్లో శాస్త్రీయ పద్ధతుల్లో మూసివేత, సంబంధిత పక్షాల భాగస్వామ్యం, సుస్థిర భూ వినియోగ ప్రణాళికకు మార్గనిర్దే శం చేసేలా.. పలు విధానాలను ఇటీవల అభివృద్ధి చేసింది. వీటిలో సామాజిక భాగస్వామ్యం కోసం 'రీక్లెయిమ్', సుస్థిర గనుల మూసివేత, పునర్వినియోగం కోసం 'లైవ్స్', అలాగే గనుల పునర్వినియోగ ప్రత్యామ్నాయాల అంచనా కోసం మౌఖిక నిర్ణయ సహాయక సాధనమైన 'సువికల్ప్' వంటివి ముఖ్యమైనవి.


ఈ దృక్పథాన్ని ప్రతిబిం బించేలా.. గనుల పునరుద్ధరణ, పర్యావరణ పునరుద్ధరణ, సామాజిక పునరావాస రంగాల్లో క్షేత్రస్థాయిలో చేపట్టిన నూతన ఆవిష్కరణలను ఈ కార్యక్రమం ప్రదర్శించనుంది. దీనికి అనుబంధంగా ఏర్పాటు చేయనున్న ప్రదర్శనలో కోల్ ఇండియా లిమి టెడ్, దాని అనుబంధ సంస్థలు, ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్సీసీఎల్), ఎన్‌టీపీసీ, ప్రైవేటు మైనింగ్ సంస్థలు చేపట్టిన వివిధ కార్యక్రమాలను ప్రదర్శించ నున్నారు. అలాగే బొగ్గు నిక్షేపాలున్న ప్రాంతాల్లో సురక్షిత తాగునీటి సౌకర్యాన్ని మరింత మెరుగు పరిచే లక్ష్యంతో కోల్ ఇండియా లిమిటెడ్ తన అనుబంధ సంస్థల ద్వారా ఏర్పాటు చేసిన కోల్ నీర్ ప్లాంట్ల ప్రారంభోత్సవం.. సామాజిక సంక్షేమం కేంద్రంగా అభివృద్ధి పట్ల సంస్థ నిబద్ధతను పునరుద్ఘాటిస్తుంది.

శాస్త్రీయ పద్ధతుల్లో గనుల మూసివేత, మైనింగ్ అనంతరం సుస్థిర పద్ధతుల్లో భూమి వినియోగ పద్ధతులను ముందుకు తీసుకెళ్లడంలో.. సంస్థాగత భాగస్వామ్యాల బలోపేతం, అంతర్జాతీయ సహకారం దిశగా ఈ కార్యక్రమం కీలక ముందడుగుగా నిలవనుంది.

'మూసివేయబోయే బొగ్గు గనుల'పై సాంకేతిక సహకారాన్ని పెంపొందించడానికి డ్యూయిష్ గెసెల్స్‌చాఫ్ట్ ఫర్ ఇంటర్నేషనల్ జుసమ్మెనార్‌బీట్ (జీఐజెడ్)తో ఒక అమలు ఒప్పందంపై బొగ్గు మంత్రిత్వ శాఖ సంతకం చేస్తుంది. సంస్థాగత సామర్థ్యాన్ని బలోపేతం చేయడం, వైజ్ఞానిక వినిమయాన్ని సులభతరం చేయడం, శాస్త్రీయ పద్ధతుల్లో గనుల మూసివేత - మైనింగ్ అనంతర పరిణామాలపై అంతర్జాతీయంగా అత్యుత్తమ పద్ధతులను అందిపుచ్చుకోవడం ఈ ఒప్పందం ముఖ్య ఉద్దేశం.

సవరించిన ఝరియా బృహత్ప్రణాళిక కింద వృత్తి నైపుణ్య శిక్షణ సదుపాయాల ఏర్పాటుకు గాను.. భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ (బీసీసీఎల్), ఝరియా పునరావాస - అభివృద్ధి ప్రాధికార సంస్థ (జేఆర్డీఏ), హిండాల్కో ఇండస్ట్రీస్ లిమిటెడ్ - రాజధాని యూనివర్సల్ ఫ్యాబ్రిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల మధ్య త్రైపాక్షిక అవగాహన ఒప్పందాన్ని కూడా ఈ కార్యక్రమంలో కుదుర్చుకోనున్నారు.

సుస్థిరత, ఆవిష్కరణ, సమాజ సంక్షేమ కేంద్రీకృత అభివృద్ధిని గనుల మూసివేత ప్రణాళికలో ఏకీకృతం చేసేందుకు కట్టుబడి ఉన్నట్టు ఈ చర్యలన్నింటి ద్వారా బొగ్గు మంత్రిత్వ శాఖ పునరుద్ఘాటిస్తోంది. వ్యవస్థీకృత విధానాలు, డిజిటల్ సాధనాలు, భాగస్వామ్య సహకార వేదికల ద్వారా.. గనుల మూసివేతను పర్యావరణ పునరుద్ధ రణ, ఆర్థిక వైవిధ్యీకరణ, దీర్ఘకాలిక ప్రాంతీయ అభివృద్ధికి ఒక గొప్ప అవకాశంగా మలచడానికి బొగ్గు మంత్రిత్వ శాఖ మార్గం సుగమం చేస్తోంది.




## జన్నారం కలప డిపోలో వేలం ప్రారంభం..

### -మంచిర్యాల డీఎఫ్ఓ రాహుల్ కిషన్ యాదవ్..

ఆదిలాబాద్, జులై 23: జన్నారం ప్రభుత్వ కలప డిపోలో గురువారం మధ్యాహ్నం మంచిర్యాల డీఎఫ్ఓ రాహుల్ కిషన్ యాదవ్ టేకు కలప వేలంపాటను ప్రారంభించారు.

ఈ కలప వేలం పాటను సాయంత్రం వరకు నిర్వహించనున్నారు. డిపోలో 55.461సీఎంటీల 204 లాట్ల టేకు కలపను వేలం జరుపుటకు నిర్ణయించగా, అందులో 150 సీఎంటీ టేకుకలపను మంచిర్యాల సీఎఫ్, కవ్వాల టైగర్ రిజర్వ్ ఎఫ్డీపీటీ శాంతారాం ఆదేశాల మేరకు ప్రభుత్వ నిర్ణీత ధర కన్నా 20 శాతం తగ్గించి ఇవ్వడానికి నిర్ణయించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ఎఫ్డీఓ రామ్మోహన్, జన్నారం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బాబా ఖాదర్ వలీ, సెక్షన్ ఆఫీసర్ శంకర్, డిపో ఉద్యోగులు మాజీద్, లింగన్న, రాకేష్, పలువురు కలప కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# నీట్ విద్యార్థులకు మద్దతుగా నిరసన..



ఆదిలాబాద్, జులై 23: నీట్ విద్యార్థులకు మద్దతుగా, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో పాటు ఇతర విపక్ష నాయకుల అరెస్టును నిరసిస్తూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా, రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టేకుమట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్ మాట్లాడుతూ, ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం పోలీసులతో లాఠీచార్జ్ చేయించడం, భాష్పవాయువు ప్రయోగించడం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు.

విద్యార్థులకు మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని టేకుమట్ల కాంగ్రెస్ పార్టీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. జంతర్ మంతర్ వద్ద తమ భవిష్యత్తు కోసం పోరాడుతున్న విద్యార్థులపై అక్రమ కేసులు నమోదు చేసినందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే దేశవ్యాప్తంగా నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని కోరారు.

ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని ఆరోపించిన సతీష్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులపై అణచివేత ధోరణి కొనసాగితే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలపై కలెక్టరేట్ ముట్టడించిన ఏఐఎస్ఎఫ్

### -పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్

### -ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరిక




కరీంనగర్, జులై 23:విద్యా రంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో విద్యార్థులు పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలసాని లెనిన్, జిల్లా అధ్యక్షుడు ఆర్నకొండ సాయి ఆజాద్, జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీఓ నంబర్లు 7, 8, 9లను రద్దు చేయడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల విలీన ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని, విద్యాశాఖకు పూర్తి స్థాయి మంత్రిని నియమించాలని కోరారు.

ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించే చట్టం తీసుకురావాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఎంఈవో, డీఈవో పోస్టులను భర్తీ చేయాలని, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అద్దె భవనాల్లో నడుస్తున్న పాఠశాలలు, హాస్టళ్లు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించడంతో పాటు విద్యార్థులకు ఉచిత రవాణా, మెస్, కాస్మొటిక్ చార్జీల పెంపు, విద్యా హక్కు చట్టం సమర్థవంతంగా అమలు చేయాలని, విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే రానున్న రోజుల్లో ఎమ్మెల్యేలు, మంత్రుల కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుండ్ల లక్ష్మీప్రసన్న, మహంకాళి శ్రీవర్ధన్, అనుప్ సాయి, అభిషేక్, చైత్ర, ఆదిత్య, మాహీన్, సాయి, గణేష్, గొడిసెల ప్రణీత్, సూర్యప్రకాశ్, రాహుల్, రోహిత్, జశ్వంత్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# అడుగడుగునా పోలీసుల పహారా

**-రాజేందర్ రెడ్డి అంత్యక్రియల నేపథ్యంలో గుండ్లపల్లిలో భారీ బందోబస్తు**
**-అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు**



కరీంనగర్, జులై 23: గుండ్లపల్లి మాజీ సర్పంచ్ భర్త బేతల్లి రాజేందర్ రెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసి చికిత్స పొందుతూ మృతి చెందిన నేపథ్యంలో, ఆయన మృతదేహాన్ని గురువారం గుండ్లపల్లి గ్రామానికి అంత్యక్రియల కోసం తరలించనున్నారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గుండ్లపల్లి స్టేజి వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ బందోబస్తును ఏసీపీ విజయ్‌కుమార్ పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే పీఏ మురళీధర్ రెడ్డి స్వగ్రామం కూడా గుండ్లపల్లి కావడంతో, రాజేందర్ రెడ్డి మృతదేహాన్ని వారి ఇంటి ముందు ఉంచే అవకాశం ఉందన్న ముందస్తు సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారని స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మురళీధర్ రెడ్డి నివాసం వద్ద కూడా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# చండీగఢ్‌లో 16వ బ్రిక్స్ ఆరోగ్య మంత్రుల సమావేశాన్ని నిర్వహించనున్న భారత్



న్యూఢిల్లీ, జులై 23:భారత 2026 బ్రిక్స్ అధ్యక్షతలో భాగంగా, జులై 22 నుంచి 24 వరకు చండీగఢ్‌లో 16వ బ్రిక్స్ ఆరోగ్య మంత్రుల సమావేశాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆరోగ్య భద్రత, డిజిటల్ హెల్త్, మహమ్మారులను ఎదుర్కొనే సన్నద్ధత, మెరుగైన వైద్య సంరక్షణను అందరికీ సమానంగా అందుబాటులోకి తెచ్చే అంశాలపై సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు బ్రిక్స్ సభ్యదేశాల ఆరోగ్య మంత్రులు, సీనియర్ ఆరోగ్య అధికారులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు.

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీమతి పుణ్య సలిల శ్రీవాస్తవ, ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ వైద్య రాజేష్ కోటేచా ఈ రోజు చండీగఢ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో 16వ బ్రిక్స్ ఆరోగ్య మంత్రుల సమావేశం ఏర్పాట్లు, అజెండా ఆశిస్తున్న ఫలితాల గురించి వివరించారు.

ప్రతికూల పరిస్థితుల ప్రతిఘటనా సామర్థ్యం, ఆవిష్కరణలు, సహకారం, సుస్థిరత సూత్రాల ఆధారంగా కీలకమైన ప్రపంచ ఆరోగ్య ప్రాధాన్యతలపై ఉమ్మడి కార్యాచరణను ముందుకు తీసుకువెళ్లేందుకు 2026 బ్రిక్స్ అధ్యక్షతన భారత్ నిబద్ధతకు ఈ సమావేశం నిదర్శనమని కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి అన్నారు. ఆరోగ్య భద్రత, మహమ్మారులను ఎదుర్కొనే సంసిద్ధత, డిజిటల్ హెల్త్, ఆవిష్కరణలు, నాణ్యమైన మందులు చౌకగా లభ్యమయ్యేలా చూడటం, సాంప్రదాయ, అనుబంధ, సమగ్ర వైద్య విధానాలు, క్షయ వ్యాధి నివారణ, ఆరోగ్యకరమైన జీవనశైలి, మానసిక ఆరోగ్యం, పటిష్టమైన ఆరోగ్య వ్యవస్థల నిర్మాణం వంటి కీలక అంశాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చిస్తారని ఆమె చెప్పారు. అందరికీ ఆరోగ్య సంరక్షణ అందించడంతో పాటు బ్రిక్స్ దేశాలవ్యాప్తంగా ఆరోగ్య ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ కార్యాచరణ కొనసాగుతుందని వివరించారు. బ్రిక్స్ దేశాల మధ్య సహకారం, విజ్ఞాన మార్పిడిని మరింత పెంచడం ద్వారా అభివృద్ధి చెందుతున్న, పేద దేశాల ఆరోగ్య ప్రాధాన్యతలకు ప్రాధాన్యమిచ్చి ముందుకు తీసుకెళ్ళడానికి ఈ సమావేశం ఒక ముఖ్యమైన వేదికగా నిలుస్తుందని కూడా ఆమె పేర్కొన్నారు.

గతంలో 2012, 2016, 2021 తరువాత భారత్ నాలుగోసారి బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టింది. . సామర్థ్యం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత సూత్రాల ఆధారంగా భారత్, తన బ్రిక్స్ కార్యాచరణలో ఆరోగ్య రంగ సహకారాన్ని కీలక అంశాల్లో ఒకటిగా చేర్చింది. ప్రజాకేంద్రిత, సమ్మిళిత ప్రపంచ ఆరోగ్య వ్యవస్థ నిర్మాణానికి భారత్ కట్టుబాటును ఈ నిర్ణయం ప్రతిబింబిస్తోంది.

ఈ సమావేశం సందర్భంగా పదకొండు బ్రిక్స్ సభ్యదేశాలైన బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇండోనేషియా నుంచి ఆరోగ్య శాఖ మంత్రులు, సీనియర్ ప్రభుత్వ అధికారులు, సాంకేతిక నిపుణులు ఒకే వేదికపైకి రానున్నారు. ఈ దేశాలన్నీ కలిసి ప్రపంచ జనాభాలో దాదాపు సగం మందికీ, ప్రపంచ స్థూల జాతీయోత్పత్తిలో సుమారు 40 శాతానికీ ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఇది అంతర్జాతీయ ఆరోగ్య రంగంలో సహకారాన్ని పెంపొందించడంలో పెరుగుతున్న బ్రిక్స్ పాత్రను స్పష్టంగా సూచిస్తోంది.

అధికారిక కార్యక్రమం జూలై 22న జరిగే సీనియర్ అధికారుల సమావేశంతో ప్రారంభ మవుతుంది. ఈ సమావేశంలో సీనియర్ ఆరోగ్య అధికారులు 'బ్రిక్స్ ఆరోగ్య సంభాషణ' కింద ప్రాధాన్యతా రంగాలపై సుదీర్ఘంగా చర్చించి, ఆరోగ్య శాఖ మంత్రుల డిక్లరేషన్ ముసాయిదాను ఖరారు చేస్తారు.

జూలై 23న 16వ బ్రిక్స్ ఆరోగ్య మంత్రుల సమావేశం జరగనుంది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ జగత్ ప్రకాష్ నడ్డా అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో సభ్యదేశాల ఆరోగ్య శాఖ మంత్రులు అంతర్జాతీయ, ప్రాంతీయ ప్రజారోగ్య ప్రాధాన్యతలపై సమగ్రంగా చర్చించి, 16వ బ్రిక్స్ ఆరోగ్య మంత్రుల డిక్లరేషన్ ఆమోదిస్తారు.

జూలై 24న "బ్రిక్స్ సంభాషణ: డిజిటల్ ఆరోగ్య రికార్డుల నుంచి ఏఐ ఆధారిత వైద్య సంరక్షణ వరకు - పరస్పరం అనుసంధానించదగిన డేటా మౌలిక వసతులు, బాధ్యతా యుతమైన ఏఐ ద్వారా నిరంతర ఆరోగ్య సంరక్షణను బలోపేతం చేయడం" అనే అంశంపై ఉన్నత స్థాయి ప్రత్యేక చర్చా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. బ్రిక్స్ వ్యాప్తంగా నిరంతర వైద్య సంరక్షణను పటిష్టం చేయడానికీ, భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనే సమర్థవంతమైన ఆరోగ్య వ్యవస్థలను నిర్మించడానికి పరస్పరం అనుసంధానించదగిన డిజిటల్ హెల్త్ మౌలిక సదుపాయాలు, బాధ్యతాయుతమైన ఏఐలను సమర్థవంతంగా వినియోగించుకోవడంపై ఈ కార్యక్రమం ప్రధానంగా దృష్టి సారిస్తుంది.

బ్రిక్స్ గత అధ్యక్షతల కాలంలో చేపట్టిన పనులను మరింత ముందుకు తీసుకెళ్తూ, పాత ప్రాధాన్యతలను కొనసాగించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం బ్రిక్స్ మిషన్, మానసిక ఆరోగ్య వికాసాన్ని ప్రోత్సహించే రెండు కొత్త ప్రాధాన్యతా రంగాలను ప్రవేశపెట్టడం ద్వారా నివారణ, ఆరోగ్య అభివృద్ధి వైద్య విధానాలపై తనకు పటిష్టమైన కట్టుబాటును భారత్ పునరుద్ఘాటించింది.

ఈ ప్రాధాన్య అంశాలు బ్రిక్స్ దేశాల ఉమ్మడి సంకల్పాన్ని ప్రతిబింబిస్తున్నాయి. సుస్థిర ఆరోగ్య వ్యవస్థల బలోపేతం, ఆరోగ్య రంగంలో ఆవిష్కరణలకు ప్రోత్సాహం, మహమ్మారుల సంసిద్ధతను పెంపొందించడం, అంటువ్యాధులు, ఇతర వ్యాధులను సమర్థంగా ఎదుర్కోవడం, నాణ్యమైన ఆరోగ్య సేవలను అందరికీ సమానంగా అందుబాటులోకి తీసుకురావడం, సార్వత్రిక ఆరోగ్య సేవల లక్ష్య సాధనను వేగవంతం చేయడం వంటి అంశాల పట్ల బ్రిక్స్ దేశాల ఉమ్మడి నిబద్ధతను ఇవి చాటుతున్నాయి.

2026 ఏప్రిల్ 15 నుంచి భారత్ ఈ ప్రాధాన్య రంగాలకు సంబంధించిన 26 సాంకేతిక సమావేశాలు, నిపుణుల సంప్రదింపులను నిర్వహించింది. బ్రిక్స్ సభ్య దేశాల నిపుణులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, ఆరోగ్య రంగంలోని కీలక అంశాలపై ఏకాభిప్రాయం ఏర్పడేలా కృషి చేసింది.

16వ బ్రిక్స్ ఆరోగ్య మంత్రుల సమావేశం ఆరోగ్య భద్రత, మహమ్మారులను ఎదుర్కొనే సంసిద్ధత, డిజిటల్ ఆరోగ్యం, ఆరోగ్య రంగంలో ఆవిష్కరణలు, అందుబాటు ధరల్లో ఔషధాల లభ్యత, సుస్థిర ఆరోగ్య వ్యవస్థల బలోపేతం వంటి అంశాల్లో బ్రిక్స్ దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయనుంది. అభివృద్ధి చెందుతున్న ఆరోగ్య ప్రాధాన్యాలకు ఊతమివ్వడంతో పాటు, సార్వత్రిక ఆరోగ్య సేవల లక్ష్య సాధన, ఆరోగ్యానికి సంబంధించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన కోసం ఉమ్మడి కార్యాచరణను ముందుకు తీసుకెళ్లేందుకు ఈ సమావేశం ఓ కీలక వేదికగా నిలవనుంది.

# భారత్ టాక్సీ సేవలు

న్యూఢిల్లీ, జులై 23:భారత్ టాక్సీ- సహకార నమూనా కింద పారదర్శకంగా డ్రైవర్ల యాజమాన్యంలో నడిచే రవాణా సేవలను అందించడానికి 'సహకార్ టాక్సీ కోఆపరేటివ్ లిమిటెడ్' నిర్వహిస్తోన్న ఒక సహకార రవాణా అప్లికేషన్. ఈ వేదికలో సారథి (డ్రైవర్) అప్లికేషన్, ప్రయాణికుల యాప్, బ్యాకెండ్ నిర్వహణ వ్యవస్థ ఉన్నాయి. సహకార్ టాక్సీ కోఆపరేటివ్ లిమిటెడ్.. దేశవ్యాప్తంగా డ్రైవర్ల ఆన్‌బోర్డింగ్, వినియోగదారుల రిజిస్ట్రేషన్, పత్రాల పరిశీలన, శిక్షణ, సేవల విస్తరణతో సహా ఈ వేదికను విడతల వారీగా అందుబాటులోకి తీసుకువస్తోంది.

ప్రస్తుతం భారత్ టాక్సీ సేవలు ఢిల్లీ-ఎన్‌సీఆర్, గుజరాత్‌లోని నగరాల్లో అందుబాటులో ఉన్నాయి. ఈ వేదికలో ఇప్పటివరకు 7.76 లక్షల మంది డ్రైవర్లు, 40.84 లక్షల మంది వినియోగదారులు నమోదు చేసుకున్నారు.

భారత్ టాక్సీ సేవలను సహకార్ టాక్సీ కోఆపరేటివ్ లిమిటెడ్ దశలవారీగా విస్తరిస్తోంది. మరిన్ని నగరాలు, రాష్ట్రాల్లో ఈ సేవలను ప్రారంభించటం- నిర్వహణ అవసరాలు, అవసరమైన అనుమతులపై ఆధారపడి ఉంటుంది. నిర్వహణ సన్నద్ధత, డ్రైవర్ల అందుబాటు, చట్టపరంగా అవసరమైన ప్రక్రియను పూర్తి చేయటం.. సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు, సహకార సంస్థలు ఇతర భాగస్వాములతో సమన్వయం వంటి అంశాలపై ఈ విస్తరణ ఆధారపడి ఉంటుంది.

సమగ్ర అమలు ప్రణాళికకు అనుగుణంగా సహకార్ టాక్సీ కోఆపరేటివ్ లిమిటెడ్... నిర్వహణ సన్నద్ధత, వర్తించే చట్టపరమైన ప్రక్రియను పూర్తి చేయటం, అవసరమైన అనుమతులను పొందటం, ఇతర పరిపాలనాపరమైన ప్రక్రియను పూర్తి చేసిన తర్వాత మాత్రమే భారత్ టాక్సీ సేవల విస్తరణను చేపడుతుంది.

ఏ రాష్ట్రంలోనైనా భారత్ టాక్సీ సేవలను ప్రారంభించడానికి ముందు సహకార్ టాక్సీ కోఆపరేటివ్ లిమిటెడ్ ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన రవాణా శాఖ, పట్టణ స్థానిక సంస్థలు, మున్సిపల్ అధికారులు, సహకార శాఖలతో సహా సంబంధిత విభాగాలతో అవసరమైన సంప్రదింపులు చేపడుతుంది. వర్తించే చట్టపరమైన నిబంధనల పరిధికి అనుగుణంగా అవసరమైన లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు, అనుమతులు, ఇతర చట్టబద్ధమైన ఆమోదాలను సహకార్ టాక్సీ కోఆపరేటివ్ లిమిటెడ్ పొందుతుంది. అవసరమైన చట్టపరమైన, పరిపాలనాపరమైన ప్రక్రియలన్నీ పూర్తయిన తర్వాత మాత్రమే కార్యకలాపాలు ప్రారంభమవుతాయి.

అమలు ప్రక్రియలో భాగంగా ఒక నగరంలో భారత్ టాక్సీ సేవలను ప్రారంభించడానికి ముందు సహకార్ టాక్సీ కోఆపరేటివ్ లిమిటెడ్.. డ్రైవర్ల నమోదు, ప్రజలలో అవగాహన కార్యక్రమాలను చేపడుతుంది. ఇటువంటి కార్యక్రమాలలో భారత్ టాక్సీ అధికారిక సోషల్ మీడియా వేదికల ద్వారా సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ శాఖలు- స్థానిక అధికారులతో భాగస్వామ్యం కావడం, అవసరమైన అవగాహన కార్యక్రమాలు ఉన్నాయి. ప్రజల్లో అవగాహన పెంపొందించడానికి, తన సేవల గురించిన సమాచారాన్ని అందించడానికి భారత్ టాక్సీ అన్ని ప్రధాన సోషల్ మీడియా వేదికల్లో చురుగ్గా అందుబాటులో ఉంటుంది. ఈ సమాచారాన్ని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానంగా ఇచ్చారు.

# టీసీఐఎమ్ బలోపేతం లక్ష్యంగా చేతులు కలిపిన బ్రిక్స్ దేశాలు

న్యూఢిల్లీ, జులై 23:బ్రిక్స్-2026 అధ్యక్షతలో భాగంగా... సాంప్రదాయిక, అనుబంధ, సమగ్ర వైద్యం (టీసీఐఎమ్) పై భారత్ ఈ రోజు బ్రిక్స్ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించింది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఆయుష్ మంత్రిత్వ శాఖ చండీగఢ్ వేదికగా సంయుక్తంగా నిర్వహించిన నాలుగు రోజుల బ్రిక్స్ హెల్త్ ట్రాక్ కార్యక్రమాల్లో భాగంగా ఈ సమావేశం జరిగింది. బహుపాక్షిక సహకార బలోపేతం... విజ్ఞానం, ఉత్తమ పద్ధతులను పంచుకోవడాన్ని ప్రోత్సహించడం... సాంప్రదాయిక- అనుబంధ- సమగ్ర వైద్య రంగంలో సహకారాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఈ టీసీఐఎమ్ సమావేశం జరిగింది. బ్రిక్స్ సభ్య దేశాల సీనియర్ ప్రభుత్వ అధికారులు, సాంకేతిక నిపుణులు, ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

బ్రిక్స్ అధ్యక్షతన భారత్ "సమర్థత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం" అనే ప్రధాన ఇతివృత్తం ఆధారంగా ఈ సమావేశాన్ని నిర్వహించింది. సాక్ష్యాధారిత సాంప్రదాయిక వైద్య విధానాలను ప్రోత్సహించడానికి... సంస్థాగత భాగస్వామ్యాలను బలోపేతం చేయడానికి... సుస్థిరమైన, సమర్థమైన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలకు దోహదపడటానికి బ్రిక్స్ దేశాల మధ్య సహకారాన్ని ఈ సమావేశం ముందుకు తీసుకువెళ్ళింది.


సాంప్రదాయిక- అనుబంధ- సమగ్ర వైద్య రంగాల్లో ఉత్తమ పద్ధతులు, విధానపరమైన అనుభవాలు, శాస్త్రీయ పురోగతులను పరస్పరం పంచుకోవడానికి ఈ సమావేశం ఒక వేదికను అందించింది. బ్రిక్స్ సభ్య దేశాలైన బ్రెజిల్, చైనా, ఈజిప్ట్, ఇథియోపియా, భారత్, ఇరాన్, రష్యా, దక్షిణాఫ్రికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వైద్య రాజేష్ కొటెచా స్వాగతోపన్యాసంతో టీసీఐఎమ్ గురించిన అధికారిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం సభ్య దేశాల ప్రతినిధి బృందాలు ప్రారంభోపన్యాసాలు చేశారు. అందుబాటులో ఉన్న అన్ని సభ్య దేశాల ఏకాభిప్రాయంతో టీసీఐఎమ్‌పై ప్రతిపాదిత బ్రిక్స్ నిపుణుల కార్యవర్గ విధివిధానాలను ఖరారు చేశారు. బ్రిక్స్ దేశాల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడం, విధానపరమైన పద్ధతులను సమన్వయం చేయడం, భవిష్యత్ సహకార రంగాలను గుర్తించడంపైనా ఈ సమావేశంలో చర్చించారు.

ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో "సామర్థ్య నిర్మాణం, విద్య, మానవ వనరుల అభివృద్ధి" అనే అంశంపై ఒక ప్రత్యేక అనుబంధ కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచవ్యాప్త అనుసంధానం గల టీసీఐఎమ్ వ్యవస్థను నిర్మించడం లక్ష్యంగా... విద్యాపరమైన సహకారాలు, ఆయుష్ స్కాలర్‌షిప్ కార్యక్రమాలు, అధ్యాపకులు-విద్యార్థుల రాకపోకలు, పరిశోధన భాగస్వామ్యాలు, సాక్ష్యాధారాల రూపకల్పన యంత్రాంగాల ద్వారా ప్రపంచవ్యాప్తంగా సాంప్రదాయిక వైద్య విద్య, శిక్షణను బలోపేతం చేయుడంపై ఈ సమావేశం ప్రధానంగా దృష్టి సారించింది.

భారత్ బ్రిక్స్-2026 అధ్యక్షతన... భారత సంపూర్ణ ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలను ప్రదర్శించే ఆయుష్ జోన్‌ను ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వైద్య రాజేష్ కొటెచా ప్రారంభించారు. ఆయుష్ ఆహారం, ఆరోగ్యం-శ్రేయస్సు సంబంధిత కన్సల్టేషన్స్, భారత మూలికా వారసత్వం, మంత్రిత్వ శాఖ దార్శనికత, ప్రపంచ స్థాయి కార్యక్రమాలు, పరిశోధన-ఆవిష్కరణలు, విజ్ఞానం గురించిన సంపూర్ణ అనుభవాన్ని ఆయుష్ జోన్ బ్రిక్స్ ప్రతినిధులకు కలిగించింది. ఆరోగ్య సంబంధిత కార్యకలాపాలు, యోగాను ప్రదర్శించిన ఈ ఆయుష్ జోన్... సాంప్రదాయిక-అనుబంధ-సమగ్ర వైద్యంలో అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించడం పట్ల భారత్ నిబద్ధతను ప్రతిబింబించింది.

# డిజిటల్ ఇండియా భాషిణి విభాగం ఆధ్వర్యంలో గోవాలో 'భాషిణి రాజ్యం' కార్యక్రమం



న్యూఢిల్లీ, జులై 23:"భాషిణి రాజ్యం: రాష్ట్ర స్థాయి భాగస్వామ్య వర్క్‌షాప్"ను ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికత మంత్రిత్వ శాఖ (ఎమ్ఈఐటీవై)లో భాగంగా ఉన్న డిజిటల్ ఇండియా కార్పొరేషనుకు (డీఐసీ) చెందిన డిజిటల్ ఇండియా భాషిణి విభాగం (డీఐడీబీ) పణజిలో నిర్వహించింది. ఈ కార్యక్రమానికి గోవా ప్రభుత్వ సమాచార సాంకేతికత, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ల విభాగం సహకారాన్ని అందించింది. వివిధ భాషల్లో కృత్రిమ మేధ (ఏఐ)ని ప్రోత్సహించడం, భాషా కేంద్రిత దృష్టికోణంతో ప్రజలకు డిజిటల్ సేవల వ్యవస్థను (డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్.. డీపీఐ) మరింత బలపరచడం ఈ వర్క్‌షాపు ముఖ్యోద్దేశం. ఈ కార్యక్రమంలో విధాన రూపకర్తలు, ప్రభుత్వంలోని సీనియర్ అధికారులు, పరిశ్రమ రంగ ప్రముఖులు, విద్యారంగ ప్రముఖులు, అంకుర సంస్థల ప్రతినిధులు, భాషా నిపుణులు పాలుపంచుకున్నారు. గోవా ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్‌తో పాటు సమాచార సాంకేతికత, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్లు, పర్యటన, ముద్రణ, స్టేషనరీ శాఖ మంత్రి శ్రీ రోహన్ ఎ. ఖౌంటే కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డిజిటల్ పరిపాలనను మరింత సమ్మిళితమైందిగా, సులభతరంగా, బహుభాషలతో కూడుకొని ఉండేదిగా తీర్చిదిద్దాలన్న ఉమ్మడి నిబద్ధతకు ఈ కార్యక్రమం అద్దం పట్టింది.

వర్క్‌షాపులో కొంకణి భాషపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, కృత్రిమ మేధ ఆధారిత భాషా సాంకేతికతలతో డిజిటల్ పాలనను మరింత సమ్మిళితంగా ఎలా తీర్చిదిద్దవచ్చో వివరించారు. ఫలితంగా పౌరులు తమకు నచ్చిన భాషను ఎంపిక చేసుకొని ప్రభుత్వ సేవలను, సమాచారాన్ని, డిజిటల్ వేదికలను ఇట్టే ఉపయోగించుకొనేందుకు వీలు కలుగుతుంది. చర్చలో పాల్గొన్న వక్తలు బహుభాషా ఏఐ ప్రాధాన్యాన్ని గురించి తెలిపారు. అది స్వర-ఆధారిత డిజిటల్ విస్తారిత అనుబంధ వ్యవస్థను (వాయిస్-ఫస్ట్ ఇకోసిస్టమ్) రూపొందించడంలో సాయపడుతుందనీ, ఫలితంగా భాష ప్రజలకు సేవలను అందించడం లో భాష అడ్డు పడటానికి బదులుగా సౌలభ్యాన్ని ఇవ్వగల మాధ్యమంగా మారగలదనీ వారు స్పష్టం చేశారు.

ప్రాథమిక కార్యక్రమంలో ప్రసంగించిన వారిలో గోవా ప్రభుత్వ సమాచార సాంకేతికత, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ల విభాగం కార్యదర్శి శ్రీ సంతోష్ సుఖ్‌దేవ్, ఐఏఎస్, గోవా ప్రభుత్వ ఉన్నత విద్య కార్యదర్శి శ్రీ ప్రసాద్ లోలేకర్, ఐఏఎస్, బిచోలిమ్ శాసనసభ్యుడు, గోవా ఇన్ఫోటెక్ సంస్థ చైర్మన్ డాక్టర్ చంద్రకాంత్ శెట్టి, గోవా సమాచార సాంకేతికత, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్లు, పర్యటన, ముద్రణ, స్టేషనరీ శాఖ మంత్రి శ్రీ రోహన్ ఎ. ఖౌంటేలతో పాటు గోవా ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్ కూడా ఉన్నారు.

డిజిటల్ ఇండియా భాషిణి డివిజన్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) శ్రీ అమితాబ్ నాగ్ కీలకోపన్యాసాన్ని ఇస్తూ, బహుళ భాషల్లో కృత్రిమ మేధ (ఏఐ) ద్వారా నిర్వహిస్తున్న భాషా-కేంద్రిత డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విషయంలో భాషిణి అనుసరిస్తున్న దృష్టికోణాన్ని సమగ్రంగా వివరించారు. పాలన, పర్యటన, ఆరోగ్యసంరక్షణ సేవలు, విద్య, బ్యాంకింగ్, పౌర సేవల వంటి రంగాలలో భాషిణి ప్రభావం అంతకంతకు పెరుగుతోందని ఆయన తెలిపారు. కొంకణి సహా ప్రాంతీయ భాషల డిజిటల్ వికాసాన్ని ప్రోత్సహించడం, డిజిటల్ సేవలను మరింత మంది వినియోగించుకొనేలా చూడడానికి ప్రభుత్వాలు, విద్యారంగ ప్రముఖులు, అంకుర సంస్థలు, భాషా నిపుణుల మధ్య ఇప్పటి కన్నా ఎక్కువ సహకారం అవసరమని ఆయన స్పష్టం చేశారు.

వర్క్‌షాపులో భాగంగా జాతీయ భాషా సాంకేతికత కేంద్రం (నేషనల్ హబ్ ఫర్ లాంగ్వేజ్ టెక్నాలజీ..ఎన్‌హెచ్ఎల్‌టీ)కి సంబంధించిన సాంకేతిక కార్యక్రమాలను కూడా నిర్వహించారు. అలాగే భాషిణికి చెందిన వివిధ భాషా ఏఐ సేవలు వేగంగా విస్తరిస్తున్న తీరును వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి 'భాషిణి యాప్ మిత్ర' 'భాషిణి మిత్ర' 'భాషిణి ప్రవర్తక'లను పరిచయం చేశారు. ఏఐ ఆధారిత అనువాదం, స్వరం గుర్తింపు, టెక్స్‌ట్-టు-స్పీచ్, లిప్యంతరణ (ట్రాన్స్‌లిటరేషన్), బహు భాషా ఏపీఐల వంటి సాంకేతికతలను ప్రభుత్వ సేవలు, పౌరులను దృష్టిలో పెట్టుకొని అందుబాటులోకి తీసుకువచ్చిన డిజిటల్ సేవలతో ఇబ్బందులూ ఎదురుకాని రీతిలో ఎలా అనుసంధానించడానికి వీలవుతుందో తెలియజేశారు. భాషిణి టీము తన ఏఐ ఆధారిత భాషా సేవలను ఆహ్వానితుల ఎదుట ప్రదర్శించింది. దీంతో కార్యక్రమానికి హాజరైన వారికి బహుళభాషలలో స్వర మెలకువలు, అనువాదం, లిప్యంతరణంతో పాటు దస్తావేజు ఆధారిత సేవలపై అవగాహన ఏర్పడింది. ఈ ప్రదర్శనలతో పౌరుల ప్రయోజనాలే పరమార్థంగా ఉండేలా పాలనను ఏ రకంగా భాషిణి బలోపేతం చేయ గలుగుతుందో కూడా సందర్శకులకు తెలిసివచ్చింది. దీంతో పాటు, పర్యటన సంబంధిత సేవలను, సార్వజనిక సమాచారాన్నీ అందుకోవడాన్ని, డిజిటల్ వేదికలకు చేరుకోవడాన్ని భాషిణి వివిధ భాషల్లో ఎలాంటి ఇబ్బందులూ ఎదురు కాకుండా, సులభతరం చేస్తూ పౌరులకు, సందర్శకులకు మెరుగైన డిజిటల్ అనుభవాలను అందించగలదని కూడా ఈ ప్రదర్శనలు (డెమాన్‌స్ట్రేషన్స్) చాటాయి. ప్రభుత్వం, విద్యారంగ ప్రముఖులు, భాషా నిపుణులు, సాంకేతిక భాగస్వాముల మధ్య సహకారంతో కొంకణి భాష డిజిటల్ ఇకోసిస్టమును ఎలా పటిష్ఠపరచవచ్చో మరొక ప్రత్యేక కార్యక్రమంలో తెలియజెప్పారు. చర్చలలో భాషా డేటాసెట్లను విస్తరించడం, ఏఐ నమూనాకు మెరుగులు దిద్దడం, గోవా అంతటా బహుభాషా ఏఐని త్వరిత గతిన అనుసరించేటట్లు చూడడం కోసం రాష్ట్రంవారీ వినియోగం సందర్భాల్ని (స్టేట్ స్పెసిఫిక్ యూజ్ కేసెస్) కూడా గుర్తించారు.

యూజ్ కేసులపై ఆధారంగా రూపొందించిన 'ఓపెన్ మైక్' కార్యక్రమం పాలన, పర్యటన, విద్య, ఆరోగ్యసంరక్షణ సేవలు, పౌర సేవలు సహా వివిధ రంగాల్లో బహుభాషా ఏఐ తాలూకు రాష్ట్రంవారీ వినియోగం తీరుపై చర్చలకు వీలును కల్పించింది. దీంతో పాటు మరింత సమ్మిళితంగా ఉంటూ, భాషకు ప్రాధాన్యాన్ని ఇస్తూ ప్రజలకు సేవలను అందించడానికి గోవా డిజిటల్ వేదికలతో 'భాషిణి'ని అనుసంధానించేందుకు గల అవకాశాలను కూడా గుర్తించింది. భాషా ప్రధాన డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చరును అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసికట్టుగా పనిచేయాలన్న భాషిణి నిబద్ధతను ఈ వర్క్‌షాపు పునరుద్ఘాటించింది. ఇది గోవా ప్రభుత్వంతో పాటు కొంకణి భాషా విస్తారిత అను బంధ వ్యవస్థను బలోపేతం చేసేందుకు, ప్రాధాన్య ప్రాతిపదికన ఉపయోగించే కేసులను గుర్తించేం దుకు, ప్రభుత్వ సేవల్లో బహుభాషా ఏఐ వినియో గాన్ని విస్తృతం చేసేందుకు తోడ్పాటును అందించే దిశగా ఒక కీలక ప్రారంభాన్ని అందించింది. దీం తో మరింత సులువైన, సమ్మిళితమైన, పౌర ప్రధాన పాలన వ్యవస్థకు ప్రోత్సాహం లభించనుంది.

గోవా ప్రభుత్వంలో సమాచార సాంకేతికత, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్లు, పర్యటన, ముద్రణ, స్టేషనరీ శాఖ మంత్రి శ్రీ రోహన్ ఎ. ఖౌంటే మాట్లాడుతూ, 'సమ్మిళిత, ఏఐ ఆధారిత డిజిటల్ గోవా'ను ఆవిష్కరించే దిశగా "భాషిణి రాజ్యమ్" వర్క్‌షాపు ఒక ముఖ్య కార్యక్రమమన్నారు. భాషతో ఎదురయ్యే ఇబ్బందుల్ని తగ్గించడంతో పాటు గోవాలోని మారుమూల ప్రాంతాల్లో నివసించే పౌరులు సహా ప్రజలందరికీ కొంకణి భాషలో డిజిటల్ సేవలను తేలికగా అందుబాటులోకి తీసుకురావడమే డిజిటల్ ఇండియా భాషిణి విభాగంతో తమ సహకారానికున్న లక్ష్యం" అని ఆయన అన్నారు. "ఏఐ త్వరిత గతిన అందరి అందుబాటులోకి వస్తే.. అది మన భాషను సంరక్షించడం, సాధికారతను కల్పించడంతో పాటు డిజిటల్ రంగంలో గోవా భవితకు, నూతన ఆవిష్కరణల రంగంలో గోవా ప్రయాణానికి కూడా కీలకంగా మారుతుంది" అని శ్రీ ఖుంటే అన్నారు.

డిజిటల్ ఇండియా భాషిణి విభాగం సీఈఓ శ్రీ అమితాబ్ నాగ్ మాట్లాడుతూ, "గోవాలో ఓ యువకుని స్వర ఆధారిత డిజిటల్ ప్రయాణాన్ని ఈ విస్తృత ప్రదర్శన (డెమాన్‌స్ట్రేషన్) తెలిపింది" అన్నారు. దీనిలో స్వర మాధ్యమం ద్వారా పాలనతో పాటు సార్వజనిక సేవల సహజ సిద్ధ సంభాషణలను భాషిణికి సంబంధించిన బహుభాషా ఏఐ ఇకోసిస్టమ్ ఏ రకంగా సుసాధ్యం చేస్తుందో చాటాం. వ్యక్తిత్వ ఆధారితమైన ప్రజెంటేషన్లో ప్రభుత్వ పథకాలు, డిజిటల్ సేవలు మొదలు విద్య, పౌర సహాయ సేవల వరకు విభిన్న అంశాలను చేర్చాం. దీని ద్వారా ఏఐ ఆధారిత వాక్కు సాంకేతిక సేవల వ్యాప్తిని మరింత సమ్మిళితం, సరళం, భాషా కేంద్రితంగా తీర్చిదిద్దవచ్చు. కార్యక్రమంలో ఏఐ సామర్థ్యాలను మరింత బలోపేతం చేయడంతో పాటు కొంకణి భాషలో స్వర ఆధారిత డిజిటల్ సార్వజనిక సేవల వికాసానికి వేగాన్ని జతచేయడానికి ఉన్నత నాణ్యత కలిగిన భాషా డేటాసెట్లను రూపొందించడానికి ఇవ్వాల్సిన ప్రాధాన్యాన్ని కూడా చర్చించాం" అని శ్రీ అమితాబ్ నాగ్ వివరించారు.

ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికత మంత్రిత్వ శాఖ (ఎమ్ఈఐటీవై) ఆధీనంలోని డిజిటల్ ఇండియా కార్పొరేషన్ (డీఐసీ)కి చెందిన డిజిటల్ ఇండియా భాషిణి విభాగం (డీఐడీబీ).. కృత్రిమ మేధ సాయంతో అనేక భాషలను డిజిటల్ మాధ్యమంలో చేర్చే లక్ష్యంతో పనిచేస్తున్న భారత జాతీయ వేదిక. 800 కన్నా ఎక్కువ ప్రభుత్వ వెబ్‌సైట్లకు ఏఐ సేవలను భాషిణి అందిస్తోంది. ఇది ఇప్పటి వరకు 800 కోట్లకు పైగా ఏఐ అంచనాలను (ఇన్‌ఫరెన్సెస్) అందించింది. రోజూ 2 కోట్ల కన్నా ఎక్కువ ఏఐ అంచనాలను సమకూరుస్తోంది. ఈ వేదిక భారత్‌లో 36 లిపి గల భాషలు, 23 మాట్లాడే భాషలు సహా 35 అంతర్జాతీయ భాషలలోనూ సేవలను అందిస్తోంది. దీంతో భాష ఆధారిత ఏఐ మెలకువలను ఉపయోగించి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చరును మరింత సులభతరంగా, భిన్న వర్గాలకు చేరుకొనే విధంగా, అంతిమంగా ప్రజలకు మేలు చేసేదిగా రూపొందించడం సాధ్యపడుతోంది.

# క్యాన్సర్, అంటువ్యాధులకు పరిష్కారాలను మెరుగుపరిచే దిశగా..

## మూడు దేశీయ బయోమెడికల్ సాంకేతికతలను బదిలీ చేసిన ఐసీఎంఆర్

న్యూఢిల్లీ, జులై 23:భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) తన వైద్య ఆవిష్కరణల పేటెంట్ మిత్ర కార్యక్రమం కింద.. దేశీయ పరిజ్ఞానంతో రూపొందించిన మూడు కీలకమైన బయోమెడికల్ సాంకేతికతలను ప్రముఖ భారతీయ ఔషధ, వ్యాక్సిన్ తయారీ సంస్థలకు బదిలీ చేసింది. ఈ సాంకేతికతల ఆధారంగా తదుపరి పరిశోధనలు, తయారీ, వాణిజ్యీకరణకు వీలుగా ఒప్పందాలు కుదిరాయి. ఇందులో భాగంగా, సర్వికల్ ఇంట్రాఎపిథీలియల్ నియోప్లాసియా (సీఐఎన్) చికిత్స కోసం రూపొందించిన, ప్రతిపాదిత కొత్త యాంటీ-హెచ్‌పీవీ ఔషధ సాంకేతికతపై ఎమ్‌క్యూర్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ సంస్థకు లైసెన్స్ ఇచ్చారు. అలాగే పేగు సంబంధిత బ్యాక్టీరియా వ్యాధుల నివారణ కోసం కలకత్తాలోని ఐసీఎంఆర్-జాతీయ బ్యాక్టీరియా వ్యాధుల పరిశోధన సంస్థ (ఐసీఎంఆర్-ఎన్ఐఆర్బీఐ) అభివృద్ధి చేసిన రెండు తదుపరి తరం వ్యాక్సిన్ సాంకేతికతలను బయోలాజికల్ ఇ- లిమిటెడ్ సంస్థకు అందించారు. ప్రభుత్వ నిధులతో జరిగిన పరిశోధనలను ప్రజలకు అందుబాటు ధరల్లో వైద్య పరిష్కారాలుగా మలచడంలో, దేశంలో బయోమెడికల్ ఆవిష్కరణల వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ఈ సాంకేతిక బదిలీలు కీలకమైన ముందడుగు.

ఐసీఎంఆర్ జాతీయ క్యాన్సర్ నివారణ, పరిశోధన సంస్థ (ఐసీఎంఆర్-ఎన్ఐసీపీఆర్)కు చెందిన డాక్టర్ షౌకత్ హుస్సేన్, అమెరికాలోని ఒక్లహామా యూనివర్సిటీ పరిధిలోని స్టీఫెన్సన్ క్యాన్సర్ సెంటర్‌కు చెందిన డాక్టర్ డోరిస్ ఎం. బెన్ బ్రూక్ మధ్య సమన్వయంతో ూఊవబిం2 రూవుదిద్దకుంది. ఇది ఈ తరహాలో మొదటి సరికొత్త చికిత్సా ప్రయోగం. ఇది ఆరోగ్యకరమైన కణాలకు హానిచేయకుండా, హెచ్‌పీవీ - ప్రేరిత క్యాన్సర్ పూర్వ, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కణాలను మాత్రమే ఎంపిక చేసుకుని నిర్మూలిస్తుంది. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు సురక్షితమైన, అందుబాటు ధరల్లో ఉండే, అతి తక్కువ శస్త్రచికిత్సతో కూడిన చికిత్సా విధానాన్ని అందించే సామర్థ్యం ఈ సాంకేతికతకు ఉంది.

సాల్మోనెల్లా టైఫీ బాహ్య త్వచ ప్రోటీన్ ఉన్న ఒక సంలీన నిర్మాణం.. ఆశాజనకమైన తదుపరి తరం టైఫాయిడ్ వ్యాక్సిన్ ప్రతిపాదనగా ఉంది.

ప్రధాన పేగు సంబంధిత బ్యాక్టీరియా వ్యాధికారకాల నుంచి మరింత విస్తృత రక్షణను అందించేలా రూపొందించిన, సాల్మోనెల్లా టైఫీ/పారాటైఫీ, షిగెల్లా వ్యాధుల నివారణకు సంబంధించిన పునస్సంయోజక వ్యాక్సిన్ కూర్పు.

క్యాన్సర్ నివారణ, అంటువ్యాధుల నియంత్రణలో భారత్ ప్రయత్నాలను బలోపేతం చేయడంతోపాటు.. తదుపరి తరం చికిత్స విధానాలు, టీకాల అభివృద్ధిని దేశీయంగా ముందుకు తీసుకువెళ్లే సామర్థ్యం ఈ సాంకేతికతలకు ఉంది.

"ప్రభుత్వ నిధులతో నిర్వహించే పరిశోధనలను ఆరోగ్యపరంగా సత్ఫలితాలను పెంచే ఉత్పత్తులుగా నిలిపేందుకు ఐసీఎంఆర్ కట్టుబడి ఉంది.

వైద్య ఆవిష్కరణల పేటెంట్ మిత్ర వంటి కార్యక్రమాల ద్వారా- పరిశోధకులు, పరిశ్రమల మధ్య భాగస్వామ్యాలను పెంపొందిస్తూ.. శాస్త్రీయ ఆవిష్కరణల నుంచి వాణిజ్యీకరణ వరకు ప్రతి మార్గాన్ని బలోపేతం చేస్తున్నాం. దేశ బయోమెడికల్ ఆవిష్కరణల వ్యవస్థలో పెరుగుతున్న పరిణతిని ఈ సాంకేతికతా బదిలీలు స్పష్టం చేస్తున్నాయి. ఆరోగ్య రక్షణ ఆవిష్కరణల్లో ఆత్మనిర్భరతను సాధించే దిశగా ఇదొక కీలక ముందడుగు" అని ఆరోగ్య పరిశోధన విభాగం (డీహెచ్ఆర్) కార్యదర్శి, ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బాల్ అన్నారు.

దేశంలో అత్యున్నత బయోమెడికల్ పరిశోధన సంస్థగా - ఆవిష్కరణ, మేధో సంపత్తి పరిరక్షణ నుంచి చికిత్సాపరమైన ధ్రువీకరణ, నియంత్రణ సౌలభ్యం, వాణిజ్యీకరణ వరకు.. ఆవిష్కరణల నిరంతర ప్రక్రియలో ఆరోగ్య రక్షణ సాంకేతికతలకు సహకరించేలా ఒక సమీకృత ఆవిష్కరణ వ్యవస్థను ఐసీఎంఆర్ నెలకొల్పింది.

'వైద్య ఆవిష్కరణల పేటెంట్ మిత్ర' ద్వారా.. పేటెంట్ దాఖలు, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, లైసెన్సింగ్ కోసం ఆవిష్కర్తలకు వ్యవస్థీకృత మద్దతు లభిస్తుంది. అలాగే దేశీయ వైద్య సాంకేతికతలకు నియంత్రణాపరమైన మార్గనిర్దేశం, క్లినికల్ మూల్యాంకనం, మార్కెట్ ప్రవేశాన్ని 'మెడ్‌టెక్ మిత్ర' సులభతరం చేస్తుంది.

వైజ్ఞానిక ఉన్నతి, వ్యూహాత్మక సహకారాలు, పారిశ్రామిక భాగస్వామ్యాలతో అందుబాటు ధరల్లో, అత్యంత నాణ్యమైన ఆరోగ్య రక్షణ పరిష్కారాలను దేశానికి, ప్రపంచానికి అందించే దిశగా.. దేశ బయోమెడికల్ ఆవిష్కరణ వ్యవస్థ బలం పెరుగుతోందనడానికి ఈ సాంకేతికతలకు లైసెన్సింగ్ ప్రక్రియ నిదర్శనం.

## 300 మొక్కలతో పచ్చదనానికి శ్రీకారం

నల్గొండ, జులై 23: పర్యావరణ పరిరక్షణలో భాగంగా కోదాడ పట్టణంలోని కేటీఎస్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కోదాడ ట్రాఫిక్ ఎస్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలీసులు, పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు కలిసి 300 మొక్కలను నాటారు.

ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా భావించి మొక్కలు నాటడమే కాకుండా, వాటిని సంరక్షించాలని సూచించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, పచ్చని వాతావరణాన్ని అందించాలంటే విద్యార్థి దశ నుంచే పచ్చదనంపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

పాఠశాల ఆవరణలో నాటిన ప్రతి మొక్కను సంరక్షిస్తామని ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కోదాడ ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, కేటీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గురు పౌర్ణమి సందర్భంగా భక్తులకు అన్నదానం



ఖమ్మం, జులై 23:సూర్యాపేట జిల్లా కోదాడ మండలం తమ్మర బండపాలెంలోని శ్రీ షిరిడీ సాయి మందిరంలో గురు పౌర్ణమి సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించి సాయిబాబా ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా మదూరి విజయ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత ధర్మకర్త, నిర్వాహకుడు కమతం రాము, మదూరి కమలమ్మ, వెంకటరెడ్డి, వీరాంజనేయులు, కృష్ణారావు, బిందు, వంశీ, నీలావతి తదితర భక్తులు పాల్గొన్నారు.

## పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి



నల్గొండ, జులై 23: ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశించారు.

గురువారం చిట్యాల పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు.

పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అనంతరం పోలీసు సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టడంతో పాటు ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించే దిశగా ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో డీఎస్పీ సంపదరావు, చిట్యాల సీఐ దగ్గు మల్లేష్, ఎస్సై పోచంపల్లి సతీష్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ ఆందోళన



నల్గొండ, జులై 23:ఢిల్లీలో నీట్ పరీక్ష పత్రాల లీకేజీ అంశంపై శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువతపై జరిగిన లాఠీఛార్జ్‌ను, వారికి మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ గురువారం చౌటుప్పల్ పట్టణంలోని వలిగొండ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో ధర్నా నిర్వహించారు. ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల ప్రకారం మండల, మున్సిపల్ కాంగ్రెస్ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నీట్ పరీక్ష పత్రాల లీకేజీపై నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం లాఠీఛార్జ్ చేయించడం దుర్మార్గమని విమర్శించారు. విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు వెళ్లిన రాహుల్ గాంధీని అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వం యువత, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని, పరీక్షల నిర్వహణలో పారదర్శకత తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, బ్లాక్, మండల, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, బోయ దేవేందర్, కాసర్ల శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గోసిక వినయ్ కుమార్, మాజీ సింగిల్ విండో చైర్మన్ వెలుగ రాజశేఖర్ రెడ్డి, నాయకులు గుండు మల్లయ్య, చెన్నగోని ఆంజయ్య, బొంగు జంగయ్య, మొగుదాల రమేష్, సుర్వి నరసింహ, బత్తుల విప్లవ్, ఎండీ హన్ను, దేప రాజు, పిల్లలమర్రి మధుసూదన్, ఈడుదుల మస్తాన్ బాబు, దుబ్బాక ఆకాశ్ రెడ్డి, సర్పంచులు, ఉపసర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అధిక నీటి పంటల వద్దు.. వర్షాధార పంటలే ముద్దు

నిజామాబాద్, జులై 23: ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు పంటల వైవిధ్యీకరణ (క్రాప్ డైవర్సిఫికేషన్) వైపు దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, మోర్తాడ్ మండల వ్యవసాయ అధికారి హరీష్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన అవగాహన సదస్సులో వారు పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుత వానాకాలంలో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా తక్కువ నీటితో పండే వర్షాధార పంటలను సాగు చేయాలని కోరారు. ముఖ్యంగా కందులు, సజ్జలు, మొక్కజొన్న వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం వల్ల కరువు పరిస్థితులను తట్టుకోవడంతో పాటు మెరుగైన దిగుబడులు, ఆర్థిక లాభాలు పొందవచ్చని వివరించారు.

స్థానిక వాతావరణ పరిస్థితులు, నేల స్వభావం, వ్యవసాయ శాఖ సూచనలకు అనుగుణంగా శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారి శ్రీనివాస్, మండల హార్టికల్చర్ అధికారి రాజగౌడ్, వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీలత, లకపతి, మహేష్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటల సాగుతోనే వర్షాభావాన్ని ఎదుర్కోవాలి

### -ఎల్‌నినో ప్రభావంపై రైతులకు వ్యవసాయ, ఉద్యానవన శాఖల అవగాహన

నిజామాబాద్, జులై 23: ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్నందున రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని భీమ్‌గల్ మండల వ్యవసాయ అధికారి లావణ్య సూచించారు. గురువారం మండలంలోని చేంగల్ రైతు వేదికలో వ్యవసాయ, ఉద్యానవన శాఖల సంయుక్త ఆధ్వర్యంలో "ఎల్‌నినో ప్రభావం-ఆరుతడి పంటల ప్రాముఖ్యత" అంశంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భారత వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు అందుబాటులో ఉన్న సాగునీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకొని తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవాలని సూచించారు.

అధిక నీటి అవసరం ఉండే వరి సాగుకు బదులుగా జొన్న, సజ్జ, వేరుశనగ, సోయాబీన్ వంటి చిరుధాన్యాలు, నూనెగింజల పంటలను సాగు చేయడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని వివరించారు. అలాగే తక్కువ నీటితో సాగయ్యే పండ్ల తోటలు, కూరగాయలు, పూల పంటలను ప్రోత్సహించడం ద్వారా రైతులు ఏడాది పొడవునా ఆదాయం పొందే అవకాశం ఉంటుందని చెప్పారు.

రైతులు వర్షపు నీటి సంరక్షణ చర్యలు చేపట్టడంతో పాటు ఇంకుడు గుంతలు, మట్టి తేమ సంరక్షణ పద్ధతులను అనుసరిస్తే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని సూచించారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు స్నేహ దివ్య, రంజిత్, అరవింద్, మౌనిక, ఉద్యానవన అధికారి జిట్టా రోహిత్, ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ నాగేశ్‌తో పాటు మండలంలోని పలువురు రైతులు పాల్గొన్నారు.

## భీంగల్ సమస్యలపై మహేష్‌కు వినతి




నిజామాబాద్, జులై 23: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో భీంగల్ మండల సర్పంచులు, కౌన్సిలర్లు కలిసి మండలంలోని పలు ప్రజా సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భీంగల్ మండలంలో పెండింగ్‌లో ఉన్న ఎమ్మార్వో కార్యాలయం నిర్మాణం, రహదారుల దుస్థితి, మినీ స్టేడియం నిర్మాణం, వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి పనుల పురోగతి తదితర అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

వినతిని స్వీకరించిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సమస్యలపై సానుకూలంగా స్పందించారు. భీంగల్‌లో నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా సూచించారు. ఆస్పత్రి నిర్మాణానికి సంబంధించిన పెండింగ్ బిల్లులను త్వరగా మంజూరు చేసి, పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా భీంగల్ పట్టణంతో పాటు పరిసర గ్రామాల రహదారుల దుస్థితిపై ఆర్ అండ్ బీ అధికారులతో మాట్లాడి, గుంతలను వెంటనే పూడ్చి మరమ్మతులు చేపట్టాలని సూచించారు.

మండలంలోని అన్ని గ్రామాల ప్రధాన రహదారులను తనిఖీ చేసి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ భీంగల్ మండల అధ్యక్షుడు మల్లె లక్ష్మణ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు అరిగెల జనార్ధన్, ఉపాధ్యక్షుడు భూక్య రమేష్, దేవేందర్, వసంత్, వసుంధర్, సర్దార్ అజయ్, అశోక్, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, భీంగల్ మండల కౌన్సిలర్లు అంజుమ్, సతీష్, సందీప్, సంగ్యా నాయక్‌తో పాటు నాయకులు వాక మహేష్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాలకు ఉర్దూ బోర్డులు ఏర్పాటు చేయాలి

మహబూబ్‌నగర్, జులై 23: ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై తెలుగుతో పాటు ఉర్దూ భాషలో కూడా నామఫలకాలు (బోర్డులు) ఏర్పాటు చేయాలని కోరుతూ ఎంఐఎం మండల అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, పట్టణ అధ్యక్షుడు ఎండి ఇస్మాయిల్ ఆధ్వర్యంలో గురువారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల ఎంపీడీవో పావని, ఎస్సై రమేష్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎంఐఎం నాయకులు మాట్లాడుతూ, ఉర్దూ రాష్ట్రంలో గుర్తింపు పొందిన భాషల్లో ఒకటని, ఉర్దూ మాట్లాడే ప్రజలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఉర్దూ బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు కార్యాలయాలను సులభంగా గుర్తించి ప్రభుత్వ సేవలను మరింత సౌకర్యవంతంగా పొందగలరని అన్నారు.

పోలీస్ స్టేషన్, మండల పరిషత్ కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి తదితర ప్రభుత్వ భవనాలపై తెలుగు, ఆంగ్ల భాషలతో పాటు ఉర్దూ భాషలో కూడా నామఫలకాలు ఏర్పాటు చేయాలని వారు కోరారు. భాషా వైవిధ్యాన్ని గౌరవిస్తూ ప్రభుత్వం ఈ అంశంపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ వినతిపై ఎంపీడీవో పావని, ఎస్సై రమేష్ స్పందిస్తూ, వినతిపత్రాన్ని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ నిబంధనల మేరకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు ముజాహిద్, రహిమతుల్లా, జాకీర్ ఖాన్, ఫారుక్ తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూ నివారణకు జాతీయ స్థాయిలో చేస్తున్న ప్రయత్నాలను బలోపేతం చేస్తూ భారత్‌లో తొలి డెంగ్యూ టీకాకు ఆమోదం తెలిపిన సీడీఎస్‌సీవో

న్యూఢిల్లీ, జులై 23:డెంగ్యూ నివారణ, నియంత్రణ కోసం భారత్ చేపడుతున్న ప్రయత్నాలను బలోపేతం చేసే దిశగా కీలకమైన విజయం నమోదయింది. డెంగ్యూ టెట్రావాలెంట్ వ్యాక్సిన్ (సజీవ, బలహీనపరిచిన) ? క్యుడెంగాకు ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీవో) మార్కెటింగ్ అనుమతులను మంజూరు చేసింది. జర్మనీకి చెందిన టకేడా జీఎంబీహెచ్ సంస్థ తయారు చేసిన ఈ టీకాను టకేడా బయోఫార్మాస్యూటికల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ దిగుమతి చేసుకుంటుంది. డెంగ్యూ వ్యాధిని నివారించడానికి దేశంలో ఆమోదం పొందిన తొలి వ్యాక్సిన్ ఇదే.

ఔషధాలు, సౌందర్య సాధనాల చట్టం - 1940, ఔషధ నియమాలు - 1945 లోని నిబంధనల ప్రకారం టీకా నాణ్యతను, భద్రతను, సామర్థ్యాన్ని సమగ్ర శాస్త్రీయ అధ్యయనం చేసిన అనంతరం ఆమోదాన్ని మంజూరు చేశారు.

రీకాంబినెంట్ డీఎన్ఏ టెక్నాలజీని ఉపయోగించి అభివృద్ధి చేసిన సజీవ, బలహీనపరిచిన టెట్రావాలెంట్ డెంగ్యూ టీకాయే క్యుడెంగా. ఈ వ్యాక్సిన్‌ను వెరో కణాల్లో ఉత్పత్తి చేస్తారు. డెంగ్యూ వైరస్ టైప్-2లో నిర్దిష్ట సీరోటైప్ ఉపరితల ప్రొటీన్ జన్యువులను ప్రవేశపెట్టి దీనిని అభివృద్ధి చేశారు. దీనిలో జన్యుపరమైన మార్పులు చేసిన సూక్ష్మజీవులు (జీఎంఓ) ఉంటాయి. ఫ్రీజ్-డ్రైడ్ పౌడర్ రూపంలో సరఫరా చేసే ఈ వ్యాక్సిన్‌ను సబ్‌క్యుటేనియస్ ఇంజెక్షన్‌గా ఇస్తారు.

4 నుంచి 60 ఏళ్ల వయసున్న వారిలో డెంగ్యూ వ్యాధి నివారణకు ఈ టీకాను సూచించారు. నిర్దేశించిన ఇమ్యునైజేషన్ షెడ్యూల్ ప్రకారం మూడు నెలల వ్యవధిలో (0, 3 నెలలు) ఒక్కొక్కటి 0.5 ఎంఎల్ చొప్పున రెండు డోసులను ఇవ్వాలి.

డెంగ్యూ ఎక్కువగా ఉండే ప్రాంతాలతో పాటు, తక్కువగా ఉండే ప్రాంతాల్లోనూ నిర్వహించిన విస్తృత అంతర్జాతీయ వైద్య అభివృద్ధి కార్యక్రమం ద్వారా ఈ వ్యాక్సిన్ భద్రత, వ్యాధి నిరోధక తత్వాన్ని, సామర్థ్యాన్ని పరీక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా వెల్లడైన ఫలితాల ఆధారంగానే ఈ ఆమోదం లభించింది. బ్రెజిల్, థాయిలాండ్, శ్రీలంక సహా ఎనిమిదికి పైగా దేశాలకు చెందిన వారిపై వైద్య అధ్యయనాలు నిర్వహించారు.

# వికసిత భారత్ స్వప్న సాకారం దిశగా ప్రస్థానం యువత సారథ్యంలో ప్రజా ఉద్యమంగా మారాలని స్పష్టీకరణ

న్యూ ఢిల్లీ, జులై 23:వికసిత భారత్ లక్ష్యం దిశగా వివిధ రంగాల్లో ప్రగతిని ప్రధానవ ంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ సమీక్షి ంచారు. ఈ మేరకు తన నివాసమైన నం.7, లోక్ కళ్యాణ్ మార్గ్‌లో నిర్వహించిన ఉ న్నతస్థాయి సమావేశానికి స్వయంగా అధ్యక్షత వహించారు. ఇందులో భాగంగా గ్రామీణా భివృద్ధి, వ్యవసాయం, సామాజిక సంక్షేమం సహా అనుబంధ రంగాల పురోగమనంపై ఆయా శాఖల కార్యదర్శులతో కూలంకషంగా చర్చించారు.

ప్రభుత్వం చేపట్టే సంస్కరణలన్నిటికీ పౌర సంక్షేమమే కేంద్రకంగా ఉండాలని ఈ సందర్భంగా ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించే సంస్కరణల అమలు వాస్తవికంగా వేగం పుంజుకుని, అర్థవం తమైన మార్పులు తేవాలని ఆయన ఆకాంక్షించారు. సంస్కరణల లక్ష్యం ప్రభుత్వ పనితీరు మెరుగుదల మాత్రమే కాదని, దేశం వికసిత భారత్‌గా రూపొందే ప్రక్రియను వేగిరపరచడమేనని వివరించారు.

దేశంలో మార్పు వేగాన్ని పరిపాలన వ్యవస్థలు ప్రతిబింబిస్తున్నాయని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. కాలానుగుణ పరిణామాల మేరకు అవసరాలను తీర్చడా నికి సమర్థంగా కృషి చేయాలని చెప్పారు. ఈ క్రమంలో పరిపాలన ప్రక్రియల అనుసరణ, బలోపేతం ప్రాధాన్యాన్ని స్పష్టం చేశారు. వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలలో కొత్త అవసరాను సమగ్రంగా గుర్తించి, నమోదు చేయాలని సూచించారు.

జాతీయ ప్రగతి లక్ష్యాల సాధనలో ఏకోన్ముఖ ప్రభుత్వ విధానం అవసరమని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. వికసిత భారత్ స్వప్న సాకారం దిశగా కృషి ప్రజా ఉద్యమంగా మారాలని, దానికి యువత సారథ్యం వహించాలని ఆయన కరాఖండీగా చెప్పారు.

యువతలో మాదక ద్రవ్య వినియోగం బెడదను పరిష్కరించాల్సిన అవసరాన్ని ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ దిశగా వివిధ శాఖల మధ్య గల అవరోధాలను తొలగించి, యువత కేంద్రక కార్యక్రమాలలో సమన్వయం, ఏకీకరణను పెంచేందుకు ఒక సంస్థాగత యంత్రాంగాన్ని రూపొందించే ప్రయత్నాలు చేయాలని ఆయన సూచించారు.

క్రీడా రంగం పురోగమనానికి సమగ్ర విధానం అవసరమని ప్రధానమంత్రి స్పష్టీకరించారు. ముఖ్యంగా క్రీడా పర్యాటకం ఓ కీలక ప్రాధాన్య రంగంగా ఆవిర్భవి స్తున్నదని ఆయన అన్నారు. అందువల్ల, ప్రపంచ క్రీడా కూడలిగా భారత్ నిలదొక్కుకునే దిశగా ప్రధాన అంతర్జాతీయ క్రీడా కార్యక్రమాలకు ఆతిథ్యం ఇవ్వాలన్నది మన ఆకాంక్షగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. క్రీడా రంగంలో సాంకేతికతకు ప్రోత్సాహం, అంకుర ఆవిష్కరణలకు ప్రోత్సాహం ప్రాధాన్యాన్ని ఆయన స్పష్టం చేశారు.

పీఎం-కుసుమ్ పథకం వంటి కార్యక్రమాలను రైతులు విస్తృతంగా అనుసరిస్తే, వ్యవసాయ రంగంలో పరిణామాత్మక మార్పులు వస్తాయని ప్రధానమంత్రి వివరించారు. అంతర్జాతీయ అవకాశాలు, భవిష్యత్ అవసరాలతో మెరుగైన అనుసంధానం కోసం నైపుణ్య అవసరాల ప్రపంచవ్యాప్త గుర్తింపు, నమోదు అవసరాన్ని ఆయన స్పష్టం చేశారు.

ఈ సమావేశం సందర్భంగా కార్యదర్శులు తమతమ రంగాల్లో వివిధ కార్యక్రమాలు, సవాళ్లపై తమ అనుభవాలను, దృక్పథాన్ని పంచుకున్నారు. మరోవైపు భవిష్యత్ కార్యాచరణ దిశగా ప్రధానమంత్రి కూడా తన సూచనలను, దృక్కోణాన్ని వారికి వివరించారు. వికసిత భారత్ లక్ష్యం దిశగా కార్యక్రమాల సమర్థ అమలు, అధిక సమన్వయం, పురోగమన వేగంపై దృష్టి సారించాలని సూచించారు. మొత్తంమీద ఈ సమావేశం అన్ని రంగాలపై సమగ్ర సమీక్ష ద్వారా కూలంకషంగా సాగింది.

ఈ సమావేశానికి మంత్రిమండలి కార్యదర్శితోపాటు కీలక మంత్రిత్వ శాఖల కార్యదర్శులు సహా ప్రధానమంత్రి కార్యాలయ సీనియర్ అధికారులు కూడా హాజరయ్యారు.

# ఉత్తర మాసిడోనియా... స్కోప్జే నగర మ్యూజియంలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన భారత రాష్ట్రపతి

న్యూఢిల్లీ, జులై 23:ఉత్తర మాసిడోనియా అధ్యక్షులు గౌరవ గోర్దానా సిల్జనోవ్‌స్కా-డావ్కోవాతో కలిసి స్కోప్జే నగర మ్యూజియంలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ఈ రోజు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభనుద్దేశించి రాష్ట్రపతి మాట్లాడుతూ... మహాత్మాగాంధీ భారత్‌కు చెందినవారైనప్పటికీ, ఆయన సందేశం యావత్ మానవాళికీ చెందుతుందని అన్నారు. సత్యం, అహింస అనేవి బలహీనతకు సంకేతాలు కావనీ... న్యాయం, గౌరవం, స్వేచ్ఛను సాధించే శక్తిమంతమైన సాధనాలని ఆయన జీవితం నిరూపించిందని ఆమె స్పష్టం చేశారు. ప్రపంచం సంఘర్షణ, అసహనం, విభజనలను ఎదుర్కొంటున్న తరుణంలో... గాంధీజీ విశ్వసించే చర్చలు, కరుణ, శాంతియుత సహజీవనం అనుసరించేందుకు అత్యంత సముచితమైనవిగా భారత రాష్ట్రపతి పేర్కొన్నారు. ఇది ద్వేషాన్ని తిరస్కరించడానికి, విభేదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవడానికి, ధైర్యంతో, సానుభూతితో సమాజానికి సేవ చేయడానికి ప్రజలకు స్ఫూర్తినిస్తుందని శ్రీమతి ద్రౌపది ముర్ము తెలిపారు.

భారత్-ఉత్తర మాసిడోనియాల మధ్య స్నేహానికి... శాంతి, సహనం, మానవత్వం పట్ల మన ఉమ్మడి నిబద్ధతకు ఇక్కడ ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ విగ్రహం శాశ్వత చిహ్నంగా నిలుస్తుందని రాష్ట్రపతి వ్యాఖ్యానించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖుల్లో స్కోప్జే నగర మేయర్ శ్రీ ఓర్స్ జార్జియెవ్‌స్కీ, భారత ప్రతినిధి బృంద సభ్యులైన వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖ సహాయ మంత్రి శ్రీమతి నిముబెన్ జయంతిభాయ్ బాంభానియా, పార్లమెంటు సభ్యులు డాక్టర్ దినేష్ శర్మ, శ్రీ విజయ్ బాఘేల్ ఉన్నారు.

ఈ కార్యక్రమానికి ముందు రాష్ట్రపతి ఉత్తర మాసిడోనియా అధ్యక్షులు గౌరవ గోర్దానా సిల్జానోవ్‌స్కా-డావ్కోవాతో కలిసి స్కోప్జేలోని మదర్ థెరిసా స్మారక చిహ్నాన్ని సందర్శించారు. మదర్ థెరిసా స్కోప్జేలో జన్మించారు. ఆమె 1928 వరకు అక్కడే నివసించారు. భారత్ రావడానికి ముందు ఆమె ఐర్లాండ్‌లోని సిస్టర్స్ ఆఫ్ లోరెట్టోలో చేరారు. మానవతావాద వ్యాప్తికి కృషి చేయడం సహా, నిస్వార్థ సేవకు గానూ 1980లో ఆమె భారత అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' అందుకున్నారు.

# నీట్ లీకేజీపై పార్లమెంట్‌లో చర్చ జరపాలి

మెదక్, జులై 23: (నేటినిజం ప్రతినిధి): నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ నిర్వహించాలని బీఆర్ఎస్ జిల్లా నాయకులు, నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠరెడ్డి తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ మేరకు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఢిల్లీలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రతి పౌరుడికి ప్రశ్నించే హక్కును రాజ్యాంగం కల్పించిందని, నిరసన తెలిపే హక్కును బలప్రయోగంతో అణచివేయడం సరికాదని అన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యతేనని, నిరసనలను అణచివేసే విధానాన్ని అనుసరించడం తగదని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, నీట్ లీకేజీతో పాటు విద్యార్థుల సమస్యలపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ నిర్వహించాలని కోరారు. అలాగే కేంద్ర హోంమంత్రి అమిత్ షా దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఢిల్లీలో జరిగిన ఘటనపై న్యాయ విచారణ జరిపించాలని, నీట్ పేపర్ లీకేజీ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు తగిన పరిహారం అందించాలని కోరారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు దేశవ్యాప్తంగా పారదర్శక పరీక్షా విధానాన్ని అమలు చేసి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# భూముల రీసర్వేతో భూ సమస్యలకు చెక్: కలెక్టర్ ప్రతిమాసింగ్

**-నిజమైన రైతులకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యం**

**-క్షేత్రస్థాయిలో పరిశీలించి భూ వివాదాలకు పరిష్కారం**



మెదక్, జులై 23: (నేటినిజం ప్రతినిధి):భూముల రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, నిజమైన రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. గురువారం మెదక్ మండలం కొంటూర్ గ్రామంలో భూభారతి భూముల రీసర్వేపై నిర్వహించిన గ్రామసభలో అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఆర్డీవో రమాదేవి, ఏడీ ల్యాండ్ సర్వే కిషన్, రైతులతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏళ్ల తరబడి మోకాపై సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని, అక్రమంగా పట్టాలు పొంది సంక్షేమ ఫలాలు పొందుతున్న వారిపై చర్యలు తీసుకుని నిజమైన రైతులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డుల ఆధారంగా పరిష్కరిస్తామని తెలిపారు.

రికార్డులు, మోకా, పట్టాదారుల వివరాలు తదితర అంశాలను పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్ణయాలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. ముందుగా గ్రామంలోని భూముల హద్దులను నిర్ధారించడం ద్వారా భూములపై స్పష్టత తీసుకువస్తామని, ప్రభుత్వ భూములను కూడా గుర్తిస్తామని తెలిపారు. పట్టా ఉండి మోకాపై లేని వారు, మోకాపై ఉండి పట్టా లేని వారి సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన ఆమె, సర్వేయర్లు, ప్రజల సహకారంతో భూ సమస్యల పరిష్కారం మరింత వేగవంతం అవుతుందని పేర్కొన్నారు.

# జన జాగరణ యాత్రను విజయవంతం చేయండి

**-సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో పాల్గొనాలని ఎంఈఓ అజ్మీర దేవానాయక్ పిలుపు**




కరీంనగర్, జులై 23: (నేటినిజం ప్రతినిధి) : ఎస్‌జీటీ వృత్యంతర శిక్షణ కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి ఎంఈఓ అజ్మీర దేవానాయక్ గురువారం జన జాగరణ యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సీపీఎస్ అత్యంత దారుణమైన పథకమని, ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలని కోరారు.

ఆగస్టు 23న హైదరాబాద్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులను సన్నద్ధం చేయడంలో భాగంగా రాష్ట్ర అధ్యక్షుడు 33 జిల్లాల్లో జన జాగరణ యాత్ర చేపడుతున్నారని తెలిపారు. ఈ నెల 28న భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్‌కు యాత్ర చేరుకోనున్న నేపథ్యంలో సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

టీఎన్‌జీవో అధ్యక్షుడు బూరుగు రవి కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో జన జాగరణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఐదేళ్లపాటు ఎన్నికైన ప్రజాప్రతినిధులకు జీవితాంతం పెన్షన్ ఉండగా, మూడు దశాబ్దాల పాటు ప్రభుత్వ సేవలో పనిచేసే ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ లేకపోవడం అన్యాయమని పేర్కొన్నారు.

జిల్లా అధ్యక్షుడు ఎండీ దిల్షాద్ మాట్లాడుతూ, సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు వచ్చే స్వల్ప పెన్షన్‌లో నుంచి ఎంప్లాయీస్ ట్రస్ట్‌కు విరాళం చెల్లించి ఆరోగ్య భద్రత పొందాలని చెప్పడం ప్రభుత్వ అనాలోచిత నిర్ణయమని విమర్శించారు. అలాగే భూపాలపల్లి మున్సిపల్ కార్యాలయంలో ఆర్ఐ జన జాగరణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఒకే వ్యవస్థలో పనిచేసే ఇద్దరు ఉద్యోగుల మధ్య సీపీఎస్, ఓపీఎస్ అనే వ్యత్యాసం ఎందుకని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

ఈ కార్యక్రమంలో కోఆపరేటివ్ అధికారి వాల్యా నాయక్, సీపీఓ జవహర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో నాగరాణి, టీఎన్‌జీవో కార్యదర్శి దశరథ రామారావు, ఆర్‌పీలు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఆదర్శప్రాయ, శ్రేష్ఠమైన వ్యక్తి గుణాలను చెప్పే సంస్కృత సుభాషితాన్ని పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జులై 23:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఓ సంస్కృత సుభాషితాన్ని ప్రజలతో ఈ రోజు పంచుకున్నారు. ఈ సుభాషితం వ్యక్తిగత, సామాజిక, జాతీయ కర్తవ్యాలను నెరవేర్చడంలో ఆదర్శప్రాయ, శ్రేష్ఠమైన వ్యక్తి గుణాలను మనకు తెలియజేస్తోంది.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఒక సందేశాన్ని ప్రధానమంత్రి పొందుపరుస్తూ:

"పరకార్యేషు యుక్తాత్మా స్వకార్యే క్షిప్రసాధనమ్

సుహృత్కార్యేషు నివృత్తీ రాజకార్యేషు విక్రమః" అని పేర్కొన్నారు.

ఇతరుల పనులను పూర్తి చేయడంలో అత్యంత నిష్ఠతో నిమగ్నమయ్యే వ్యక్తి, తన వ్యక్తిగత పనులను త్వరగా, సమర్థంగా నెరవేర్చే వ్యక్తి, మిత్రుల పనులను స్వార్థరహితంగా ముగించే వ్యక్తి, దేశం పట్ల కర్తవ్యాలను నిర్వహించడంలో తన పూర్తి పరాక్రమాన్ని, సాహసాన్ని కనబరిచే వ్యక్తి మాత్రమే శ్రేష్ఠమైన వ్యక్తి అని ఈ సుభాషితం మనకు బోధిస్తోంది.

# నీట్ విద్యార్థులకు మద్దతుగా కాంగ్రెస్ నిరసన

**-కేంద్ర మంత్రుల రాజీనామాకు డిమాండ్.. నాంపల్లిలో ర్యాలీ, రాస్తారోకో**



హైదరాబాద్, జులై 23:నీట్ విద్యార్థులకు మద్దతుగా, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ నాంపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం భారీ ర్యాలీ, ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. బస్టాండ్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ చేపట్టి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా నాంపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం పోలీసులతో లాఠీచార్జ్ చేయించడం, భాష్పవాయువు ప్రయోగించడం దురదృష్టకరమని విమర్శించారు. విద్యార్థులకు మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

జంతర్ మంతర్ వద్ద తమ భవిష్యత్తు కోసం పోరాడుతున్న విద్యార్థులపై అక్రమ కేసులు నమోదు చేసినందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే దేశవ్యాప్తంగా నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే పదవి నుంచి తప్పుకోవాలని కోరారు.

ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులపై అణచివేత ధోరణి కొనసాగితే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పూల వెంకటయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎరెడ్ల రఘుపతి రెడ్డి, గాలెంక వినోద్ కుమార్, బట్టు జగన్, నేతల కొండలు, బేగరి గిరి, మెగావత్ చిట్టి శ్రీనివాస్ నాయక్, జాన్ తండా సర్పంచ్ వెంకన్న నాయక్, మేకల రమేష్ యాదవ్, బత్తుల వంశీ, సుదనబోయిన శ్రీను, ఈద శేఖర్, కాశీమల్ల గోవర్ధన్, కోరే యాదయ్య, మాజీ ఎంపీటీసీ పంతునాయక్, గిరి వెంకటయ్య, వీరమల్ల సందీప్, పానుగంటి వెంకటయ్య గౌడ్, సాయిలు గౌడ్, గాదేపాక నాగరాజు, బిరుదోజు యాదమ్మ, మండల సమాఖ్య అధ్యక్షురాలు వీరమల్ల శైలజ, మండల కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ సైన్స్, గణిత ఒలింపియాడ్స్-2026లో భారత యువశక్తిని చాటిన డీఏఈ ఒలింపియాడ్ కార్యక్రమం

న్యూఢిల్లీ, జులై 23:నేషనల్ ఒలింపియాడ్ కార్యక్రమం ద్వారా శిక్షణ పొందిన విద్యార్థులు అంతర్జాతీయ ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోలజీ, మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్స్?2026లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. ఇది భారతదేశంలో శాస్త్రీయ ప్రతిభను ప్రోత్స హించడంలో అణు విద్యుత్ విభాగం ప్రదర్శి స్తున్న చిత్తశుద్ధిని మరోసారి స్పష్టం చేస్తోంది. ఈ విజయాలు భారతీయ యువతకున్న అసాధారణ సామర్థ్యాన్ని తెలియజేస్తున్నాయి. అలాగే దేశంలోనే అత్యంత ప్రతిభావంతులను గుర్తించి వారికి మార్గనిర్దేశం, స్ఫూర్తిని అందించడానికి దశాబ్దాల తరబడి నిర్మించిన జాతీయ వ్యవస్థ సామర్థ్యాన్ని కూడా ప్రతిబింబిస్తోంది. భారత దేశ యువతకున్న సామర్థ్యాన్ని ఒలింపియాడ్ బృందాలు సాధించిన ఈ విజయం తెలియజేస్తోంది. అదేవిధంగా అంతర్జాతీయ వేదికపై ప్రతిభను చాటుకొనే అవకాశాలను ప్రతిభావంతులైన విద్యార్థులకు అందించేలా దీర్ఘకాలంగా కొనసాగిస్తున్న పెట్టుబడి ప్రయత్నాలను కూడా వివరిస్తోంది. 2026 అంతర్జాతీయ ఒలింపియాడ్‌లో భారత్ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. నాలుగు ఒలింపియాడ్‌ల్లోనూ.. భారత బృందం 12 స్వర్ణ, 7 రజత పతకాలను గెలుచుకుంది. వాటిలో భౌతిక, రసాయన శాస్త్ర ఒలింపియాడ్స్‌లో పాల్గొన్న వారంతా బంగారు పతకాలు సాధించడం చరిత్రాత్మకం. జీవ, గణిత శాస్త్రాల్లోనూ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. ప్రపంచంలోనే అత్యంత ప్రతిభావంతులతో పోటీపడిన భారతీయ విద్యార్థులు అసాధారణ శాస్త్రీయ నైపుణ్యాన్ని, పట్టుదలను, సృజనాత్మకతను ప్రదర్శించారు. దేశానికి గర్వకారణంగా నిలిచారు. సైన్స్, గణితంలో ప్రపంచ శక్తిగా భారత్ స్థానాన్ని బలోపేతం చేశారు.

అసాధారణ విజయం సాధించిన విద్యార్థులను అణు విద్యుత్ విభాగం కార్యదర్శి, అణు విద్యుత్ కమిషన్ చైర్మన్ డాక్టర్ అజిత్ కుమార్ మహంతి అభినందించారు. "అంతర్జాతీయ ఒలింపియాడ్‌ల్లో భారత విద్యార్థులు కనబరిచిన అద్భుత ప్రదర్శన దేశానికి గర్వకారణం. ఇది భారత దేశ శాస్త్రీయ స్ఫూర్తికి వేడుకలాంటిది. ఈ విజయాలు విద్యార్థుల అంకితభావాన్ని, వారికి మార్గదర్శకులు, ఉపాధ్యాయులు అందించిన అమూల్యమైన మార్గదర్శకత్వాన్ని, దశాబ్దాల తరబడి ఎంతో శ్రమకోర్చి నిర్మించిన సంస్థాగత వ్యవస్థ సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయి" అన్నారు.

అణు విద్యుత్ విభాగం పరిధిలోని ఎయిడెడ్ సంస్థ అయిన టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్ఆర్) జాతీయ కేంద్రమైన హోమీ బాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ (హెచ్‌బీసీఎస్ఈ) ఈ విజయంలో ప్రధాన భూమిక పోషించింది. భారత సైన్స్, గణిత ఒలింపియాడ్ కార్యక్రమాలకు జాతీయ నోడల్ కేంద్రంగా హెచ్‌బీసీఎస్ఈ ఉంది. ఇది బహుళ దశల ప్రక్రియ ద్వారా ప్రతిభను గుర్తించడం, అవగాహన పెంపొందించడం, మెరుగైన శిక్షణ, మార్గదర్శకత్వం అందించడం ద్వారా ప్రీయూనివర్శిటీ స్థాయి విద్యార్థులను అత్యున్నత అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా సన్నద్ధం చేస్తుంది. డీఏఈ అందిస్తున్న సంస్థాగత మద్దతు, శాస్త్రీయ నైపుణ్యం పెంపొందించడంలో నిబద్ధత కారణంగా ఈ కార్యక్రమం ప్రపంచంలోనే గౌరవప్రదమైన ఒలింపియాడ్ వ్యవస్థగా మారింది.

భారత ఒలింపియాడ్ కార్యక్రమాన్ని ప్రోత్సహించేలా డీఏఈ అందిస్తున్న మద్దతును హెచ్‌బీసీఎస్ఈ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్ణబ్ భట్టాచార్య ప్రశంసించారు. "హెచ్‌బీసీఎస్ఈకి అందిస్తున్న అమూల్యమైన సహకారానికి, దేశంలో శాస్త్రీయ ప్రతిభను ప్రోత్సహించాలన్న సంకల్పాన్ని ప్రదర్శిస్తున్నందుకు అణు విద్యుత్ విభాగానికి కృతజ్ఞతలు. తర్వాతి తరం యువ మేధావులను గుర్తించడం, ప్రోత్సహించడం, స్ఫూర్తి నింపడం అనే మా లక్ష్యాన్ని మా విద్యార్థులు సాధించిన అద్భుతమైన ప్రదర్శనలు బలోపేతం చేస్తున్నాయి. అదే సమయంలో దేశవ్యాప్తంగా సైన్స్, గణితంలో నైపుణ్యాలను పెంపొందించుకొనే సంస్కృతిని ప్రోత్సహిస్తున్నాయి" అని తెలియజేశారు.

అణు విద్యుత్ విభాగం అందిస్తున్న సాయం కేవలం ఆర్థిక తోడ్పాటుకు మాత్రమే పరిమితం కాలేదు. దేశవ్యాప్తంగా ఉన్న శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులు, విద్యా సంస్థలు, సబ్జెక్టు నిపుణులను ఒక్కచోట చేర్చి శాస్త్రీయ ప్రతిభను ప్రోత్సహించే ఉమ్మడి జాతీయ వ్యవస్థను తయారు చేయడంలో టీఐఎఫ్ఆర్, హెచ్‌బీసీఎస్ఈలకు డీఏఈ సహకారం అందించింది. భారత్‌లోనూ, అంతర్జాతీయంగానూ ఉన్నత విద్య, పరిశోధన, ఆవిష్కరణ, శాస్త్రీయ నాయకత్వంలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఒలింపియన్లను ఈ సహకారాత్మక విధానం తీర్చిదిద్దుతోంది.

పతక విజేతలకు, బృంద నాయకులకు, సైంటిఫిక్ అబ్జర్వర్లకు, హెచ్‌బీసీఎస్ఈలోని ఒలింపియాడ్ విభాగాలకు, ఉపాధ్యాయ సంఘాలకు, దేశవ్యాప్తంగా ఉన్న రిసోర్స్ పర్సన్ వ్యవస్థకు అణు విద్యుత్ విభాగం అభినందనలు తెలియజేసింది.

# పాత ఎస్సీఈఆర్టీలకు మళ్లీ అవకాశం ఇవ్వొద్దు

**-కొత్త వారికి అవకాశం కల్పించాలని కనక యాదవరావు డిమాండ్**

న్యూఢిల్లీ, జులై 23:ఐటీడీఏ ద్వారా నియమించిన పాత ఎస్సీఈఆర్టీలకు మళ్లీ అవకాశం ఇవ్వకుండా కొత్త వారికి అవకాశం కల్పించాలని కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్, ఆదివాసీ సంఘాల ఐకాస రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కనక యాదవరావు డిమాండ్ చేశారు.

గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఐటీడీఏ పాఠశాలల కాంప్లెక్స్ పరిధిలో ఎస్సీఈఆర్టీలుగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు ఈసారి అవకాశం కల్పించవద్దని కోరారు. కొందరు రాజకీయ నాయకుల ద్వారా కమిషనర్ స్థాయి వరకు వెళ్లి ప్రతిసారి వారికే అవకాశం వచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.

# విశ్వ నరుడు గుర్రం జాషువా

## జూలై 24... కవి కోకిల వర్ధంతి



ఒక అంటరాని వాడు, పవిత్రమైన హిందూ గ్రంథాలు ,కావ్యాలు చదువు తున్నాడని ఇటు హిందూ ఛాందసులు కన్నెర్రజేస్తే, క్రైస్తవుడై వుండి హిందూ నాటకాలు రాసి హిందూ మత ప్రచారానికి తోడ్పడు తున్నాడని క్రైస్తవ మతాధిపతుల ఆగ్రహానికి గురైనాడు జాషువా. ఒక వంక దారిద్ర్యం, మరోవంక కుల మత వివక్ష. బాల్యంనుంచే జాషువా ఎన్నో అవమానాల్ని, అవ హేళనల్ని, ఛీత్కారాలను ఎదుర్కొన్నాడు. చిన్నతనం నుంచే తిరగబడే తత్త్వంతో వీటన్నింటినీ అధిగమించిన జాషువా, విద్యార్థి దశనుంచే వ్యంగ చిత్రాలు గీయడం, గొల్లసుద్దులు పాడుకోవడం, లలిత కళల పట్ల ఆసక్తి పెంచు కొన్నాడు. దీపాల పిచ్చయ్యశాస్త్రి, జూపూడి హనుమచ్ఛాస్త్రి వంటి కొందరు జాషువా ఉన్నతికి తోడ్పడితే, మరి కొందరు జాషువాను కులం పేరుతో తీవ్రంగా అవమానించారు. జీవితంలో ఎన్నోసార్లు, ఎన్నోచోట్ల జాషువా కులం తెలుసుకొని అవమానించినా, ఆవేదనకు లోనైనా, నిరుత్సాహ పడక, "కళకు కుల మతాలున్నాయా?" అని ప్రశ్నిస్తూ, ఆత్మస్థైర్యంతో ఎదుర్కొని గొప్పకవిగా ఖ్యాతిని పొందారు. "విశ్వనరుడ నేను" అని సామాజిక వాస్తవికతను నిర్భయంగా చాటాడు. పుట్టుకతో దళితుడైనా, పట్టుదలతో కవిశేఖరుడై, నవయుగ కవిచక్రవర్తి, తమ కవితా ప్రతిభతో తెలుగు సాహితీ లోకంలో ప్రజ్వరిల్లిన తేజోమూర్తి జాషువా. ఆయన సమకాలీన కవిత్వ ఒరవడి యైన భావ కవిత్వపు రీతి నుండి పక్కకు జరిగి, సామాజిక ప్రయోజనం ఆశించి రచనలు చేశాడు. జాషువా 1895, సెప్టెంబర్ 28 న గుర్రం వీరయ్య, లింగమ్మ దంపతులకు ఆంధ్ర ప్రదేశ్ లోని గుంటూరు జిల్లా వినుకొండ మండలం చాట్రగడ్డపాడులో జన్మించాడు. తండ్రి యాదవులు, తల్లి మాదిగ. మూఢాచారాలతో నిండిన నాటి సమాజంలో అవమానాలకు లోనైనాడు. అయినా జాషువా ఊరుకొనే వాడు కాదు, తిరగ బడేవాడు. అగ్రవర్ణాల పిల్లలు కులం పేరుతో హేళన చేస్తే, తిరగబడి వాళ్ళను కొట్టాడు. 1910లో మేరీని పెళ్ళి చేసు కున్నాడు. అయినా ఆయన కుటుంబాన్ని క్రైస్తవ సమాజం నుండి బహిష్కరించారు. మిషనరీ పాఠశాలలో నెలకు మూడు రూపాయల జీతంపై ఉద్యోగం చేసేవాడు. తర్వాత రాజమండ్రి వెళ్ళి 1915-16 లలో అక్కడ సినిమా వాచకుడిగా పని చేసాడు. టాకీ సినిమాలు లేని ఆ రోజుల్లో తెరపై జరుగుతున్న కథకు అనుగుణంగా నేపథ్యంలో కథను, సంభాషణలను చదువుతూ పోవడమే ఈ పని. తరువాత గుంటూరులోని లూథరన్ చర్చి నడుపుతున్న ఉపాధ్యాయ శిక్షణాలయంలో ఉపాధ్యాయుడిగా 10 సంవత్సరాల పాటు పనిచేసాడు. తరువాత 1928 నుండి 1942 వరకు గుంటూరు లోనే ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడిగా పనిచేసాడు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో యుద్ధ ప్రచారకుడిగా కూడా పనిచేసాడు. 1957-59 మధ్య కాలంలో మద్రాసు రేడియో కేంద్రంలో కార్యక్రమ నిర్మాతగా పని చేసాడు. చిన్నతనం నుండి జాషువాలో సృజనాత్మక శక్తి ఉండేది. బాల్య స్నేహితుడూ, తరువాతి కాలంలో రచయితా అయిన దీపాల పిచ్చయ్య శాస్త్రి సాహచర్యంలో ఆయనకు కవిత్వంపై ఆసక్తి కలిగింది. జూపూడి హనుమచ్ఛాస్త్రి వద్ద మేఘసందేశం,రఘువంశం, కుమార సంభవం నేర్చుకున్నాడు. జాషువా 36 గ్రంథాలు, మరెన్నో కవితా ఖండికలు రాసాడు. కళకు కులమతాలున్నాయా? అంటూ జాషువా ప్రశ్నిస్తూ-- "నా కవితా వధూటి వదనంబు నెగాదిగ జూచి, రూపు రేఖా కమనీయ వైఖరులు గాంచి భళీభళీ; యన్నవారే, మీదేకుల మన్న ప్రశ్న వెలయించి, చివాలున లేచిపోవుచో బాకున గ్రుమ్మినట్లగున్ పార్థివ చంద్ర! వచింప సిగ్గగన్!" అంటూ వెంకటగిరి రాజా గారికి తన ఆవేదన చెప్పుకున్నాడు.

"కుల మతాలు గీచుకున్న గీతలు జొచ్చి
పంజరాన గట్టు వడను నేను
నిఖిలలోక మెట్లు నిర్ణయించిన
నాకు తరుగు లేదు విశ్వనరుడ నేను'. అయితే కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని ఈ మూఢాచారాలపై తిరగబడ్డాడు.

జాషువా, ఛీత్కారాలు ఎదురైన చోటే సత్కారాలు పొందాడు. అగ్రవర్ణ దురహంకారాలను చవి చూసిన జాషువా సౌమ్య పదజాలం తోనే వాటిని ఎదిరించాడు. ఓ సందర్భంలో ఆయనే చెప్పినట్లు "నాకు గురువులు ఇద్దరు...పేదరికం, కులమత బేధం. ఒకటి సహనాన్ని నేర్పితే, రెండవది నాలో ఎదిరించే శక్తిని పెంచింది. "ఆయన కవిగా, వ్యక్తిగా విరాట్రూప ప్రదర్శనకు నేపథ్యాలు. ఆయన

క్రమంగా ఆయన నాస్తికత్వం వైపు జరిగాడు. బాల్య స్నేహితుడు, తరువాతి కాలంలో రచయిత అయిన దీపాల పిచ్చయ్య శాస్త్రి సాహచర్యంలో ఆయనకు కవిత్వంపై ఆసక్తి కలిగింది. జూపూడి హనుమచ్ఛాస్త్రి వద్ద మేఘసందేశం, కుమార సంభవం, రఘు వంశం నేర్చుకున్నాడు. జాషువా 36 గ్రంథాలు, మరెన్నో కవితా ఖండికలు వ్రాశాడు. వాటిలో ప్రముఖమైనవి... క్రీస్తుచరిత్ర , గబ్బిలం, పిరదౌసి, రుక్మిణీ కళ్యాణం, శ్మశాన వాటిక, వివేకానంద, జేబున్నీసా, నాగార్జున సాగరం, కాందిశీకుడు. 'నా కథ' పేరుతో ఆత్మకథను కూడా వ్రాసు కున్నారు. ఆయన మనో భావాన్ని దళిత యువకుడి ద్వారా చక్కగా చెప్పాడు."వాని నుద్ధరించు భగవంతుడే లేడు, మనుజెడెట్లు వాని గనికరించు, వాడు జేసికొన్న పాపకారణ మేమో యింత వరకు వాని కెరుకలేదు."""ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి యినుపగజ్జెల తల్లి జీవనము సేయు, గసరి బుసకొట్టు నాతని గాలిసోక నాల్గు పడగల హైందవ నాగరాజు".

ఇలా చెప్పుకుంటూ పోతే, ప్రతి పద్యాన్ని ఉదహరించ వచ్చు."సుకవి జీవించు ప్రజల నాల్కల యందు" అనే ఈ పద్యంలో కవిలోకానికి జాషువా సముచిత స్థానం కల్పించాడు. తిరుపతి వెంకట కవులలో ఒకరైన చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రి, జాషువా కాలికి గండ పెండేరం తొడిగి "ఈ కవీశ్వరుని పాదం తాకి నా జన్మ ధన్యం చేసుకున్నాను" అన్నాడు. అది తనకు లభించిన "అత్యున్నత పురస్కారం"గా జాషువా భావించాడు. 1964లో క్రీస్తు చరిత్రకు "కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు" లభించగా, ఆంధ్ర ప్రదేశ్ శాసన మండలి సభ్యునిగా నియమితుడయ్యాడు.

1970లో ఆంధ్ర విశ్వ విద్యాలయము కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించింది. భారత ప్రభుత్వము పద్మభూషణ పురస్కారం అందజేసింది.

విశ్వనాథ సత్యనారాయణ, జాషువా ఒక మధుర కవి అని, ఒకానొక మాధుర్యం ఆయన కవిత్వంలో శారదాదేవి అనుగ్రహం చేత లభించిందని అన్నాడు. "ఆయన వ్రాసిన శిశువు (పాపాయి) అనే ఖండికను ఘంటసాల అద్భుతంగా గానం చేశారు. ఈ సందర్భంలో ఈ పాట రికార్డింగ్ జరిగే సమయంలో జాషువా, ఘంటసాల యింటికి వెళ్ళి, బయట అరుగు మీద కూర్చున్నారట. ఘంటసాల, బయటకు వచ్చి, "ఏమిటండీ! బయటనే కూర్చున్నారు" అని అడిగితే, "నేను అంటరాని కులమునకు చెందిన వాడను, మీరు బ్రాహ్మణులు, మీ అనుమతి లేకుండా లోపలి ఎలా రాగలను?" అన్నారట జాషువా. అందుకు, ఘంటసాల "నాకు అటువంటి పట్టింపులు లేవు, మీరు స్వేచ్ఛగా లోపలి రావచ్చు. పైగా మీరు సరస్వతీ పుత్రులు. మీరు అంటరాని వారైతే, సరస్వతీ దేవి కూడా అంటరానిదనే కదా అర్థం!" అని చెప్పియింటి లోకి సాదరంగా తీసుకొని వెళ్లి, తన సహృదయాన్ని చాటుకొన్న ధన్యజీవి ఘంటసాల.

కవితా విశారద, కవికోకిల, కవి దిగ్గజ - నవయుగ కవి చక్రవర్తి, మధుర శ్రీనాథ, విశ్వకవి సామ్రాట్ గా ప్రసిద్ధు దయ్యాడు. "వడగాల్పు నా జీవితమైతే, వెన్నెల నా కవిత్వం" అని జాషువా అన్నది అక్షర సత్యం. "రాజు మరణించె నొక తార రాలిపోయె, సుకవి మరణించె నొక తార గగనమెక్కె, రాజు జీవించు రాతి విగ్రహముల యందు, సుకవి జీవించు ప్రజల నాల్కల యందు". " సత్కవీంద్రుని కమ్మని కలము, నిప్పులలోన గఱగిపోయె ! యిచ్చోట; నే భూము లేలు రాజన్యుని యధికార ముద్రిక లంతరించె! యిచ్చోట; నే లేంత యిల్లాలి నల్లపూసల సౌరు, గంగలో గలిసిపోయె! యిచ్చోట; నెట్టి పేరెన్నికం గనుꣳగొన్న చిత్ర లేఖకుని కుంచియ, నశించె! ఇది పిశాచులతో నిటాలేక్షణుండు గజ్జె గదలించి యాడు రంగస్థలంబు; ఇది మరణ దూత తీక్షణమౌ దృష్టు లొలయ నవనిꣳ బాలించు భస్మ సింహాసనంబు". స్మశాన వాటిక లోని ప్రతి పద్యం మన గుండెలను పిండుతుంది.

చివరికి జూలై 24, 1971న గుర్రం జాషువా లోకం వదిలి వెళ్ళారు. కాని ఆయన మరణవార్త బయటి ప్రపంచానికి చెప్పని ఇంటి వాతావరణం.

అంతిమ యాత్ర అయిన వారు వెంట లేకుండా సాగింది. సమాజం ఆయనను చిన్న చూపు చూసింది, దూరంగా పెట్టిందని మధనపడిన జాషువా చివరి దశలో కుటుంబ సభ్యులు ఆయనను దూరం చేశారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# డీజీపీని కలిసిన ఎమ్మెల్యేలు చింతా, కొనింటి

## -జహీరాబాద్ పోలీస్ స్టేషన్ అప్‌గ్రేడ్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు వినతి



సంగారెడ్డి, జులై 23: (నేటినిజం ప్రతినిధి):: తెలంగాణ రాష్ట్ర డీజీపీ సి.వి.ఆనంద్‌ను సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ బుధవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా జహీరాబాద్ పట్టణంలో పెరుగుతున్న జనాభా, పారిశ్రామిక విస్తరణ, ట్రాఫిక్ సమస్యలను ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. జహీరాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్‌ను తక్షణమే అప్‌గ్రేడ్ చేయడంతో పాటు ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. జహీరాబాద్ పట్టణ జనాభా లక్షకు పైగా చేరుకోవడం, ఇటీవల ఐదు గ్రామాలు మున్సిపాలిటీలో విలీనం కావడం, పరిసర ప్రాంతాల్లో అనేక చిన్న, పెద్ద పరిశ్రమలు ఏర్పడటంతో వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు ఉపాధి కోసం ఇక్కడికి వస్తున్నారని వివరించారు. ఈ పరిస్థితుల్లో శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజలకు వేగవంతమైన పోలీసు సేవలు అందించేందుకు పోలీసు వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా పారిశ్రామిక ప్రాంతాల్లో భద్రత, మహిళల రక్షణ, ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరారు. ఈ అంశాలపై డీజీపీ సి.వి.ఆనంద్ సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకునే దిశగా పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, మల్కాపురం శివకుమార్ తెలిపారు.

# అమీన్‌పూర్‌ను రాష్ట్రంలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం

సంగారెడ్డి, జులై 23: (నేటినిజం ప్రతినిధి): అమీన్‌పూర్‌ను రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని రాష్ట్ర శక్తి (కార్మిక, ఉపాధి, శిక్షణ?ఫ్యాక్టరీలు), గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి తెలిపారు.

బుధవారం అమీన్‌పూర్‌లో రూ.16.53 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్‌పూర్‌కు అవసరమైన అన్ని మౌలిక వసతులను దశలవారీగా కల్పిస్తామని తెలిపారు.

సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ), స్టార్మ్ వాటర్ డ్రెయిన్లు, శ్మశానవాటిక అభివృద్ధి, సెంట్రల్ మీడియన్ నిర్మాణం వంటి పనులు పూర్తయితే ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని మంత్రి పేర్కొన్నారు.

ప్రజల అవసరాలకు అనుగుణంగా అధికారులు మరిన్ని అభివృద్ధి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపిస్తే, వాటి అమలుకు అవసరమైన అదనపు నిధులను కూడా ప్రభుత్వం మంజూరు చేస్తుందని హామీ ఇచ్చారు. పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

కొత్త రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఎల్ఐజీ గృహాల నిర్మాణం వంటి సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. వచ్చే ఏడాది అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళిక రూపొందించాలని, అవసరమైతే అదనపు నిధులు కూడా విడుదల చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దాశరథి ప్రతి అడుగు సమాజ హితం కోసమే

## దాశరథి వేడుకల్లో వక్తలు



దాశరథి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అతిథులు.



రచయిత గుడిపాటికి పురస్కారాన్ని అందజేస్తున్న వాణిప్రసాద్. చిత్రంలో వెన్నెల గద్దర్, శకుంతల, డా॥ అమ్మంగి వేణుగోపాల్, లక్ష్మణ్, డా॥ఏనుగు నరసింహారెడ్డి తదితరులు.

హైదరాబాద్, జులై 23:తెలంగాణ వైతాళికుడు దాశరథి కృష్ణమాచార్య రచనలను సమాజానికి అంకితం చేశారని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ దాశరథి కృష్ణమాచార్య 101వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం సీనియర్ పాత్రికేయులు, రచయిత గుడిపాటికి ప్రతిష్టాత్మక దాశరథి కృష్ణమాచార్య పురస్కారంతో పాటు రూ.1 లక్ష చెక్కును అందజేశారు.

ఈ సందర్భంగా సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రభుత్వ కార్యదర్శి వాణీప్రసాద్ మాట్లాడుతూ దాశరథి ప్రతి నిమిషం, ప్రతి అడుగు సమాజ హితం కోసమే కృషి చేశారని కొనియాడారు. దళిత, బహుజనులకు జరుగుతున్న అన్యాయాలపై సమాజాన్ని చైతన్యపరిచారని, ఆయన ఒక సోషల్ రిఫార్మర్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, దాశరథి అవార్డు కమిటీ సభ్యులు అమ్మంగి వేణుగోపాల్, దాశరథి తనయులు లక్ష్మణ్, ఇందిరతో పాటు కవులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు కాకతీయ సేవా సమితి స్కాలర్‌షిప్స్ అందజేత



నల్గొండ, జులై 23:సమాజంలో అట్టడుగు వర్గాల వారికి సేవ చేయడమే లక్ష్యంగా కాకతీయ సేవా సమితి పని చేస్తుందని సేవా సమితి సభ్యులు తెలిపారు. గురువారం దుర్గాపురం వై జంక్షన్ కాకతీయ కళ్యాణ మండపంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మాజీ ఎమ్మెల్యే వీరేపల్లి లక్ష్మీనారాయణరావు సౌజన్యంతో ఆయన సతీమణి సత్యవతి మూడవ వర్ధంతి సందర్భంగా 10 మంది విద్యార్థులకు లక్ష రూపాయల స్కాలర్ షిప్ లను అందజేశారు. ఈ కార్యక్రమానికి అన్ని పార్టీల నాయకులతో పాటు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎలాంటి స్వార్థం లేకుండా కాకతీయ సేవా సమితి సభ్యులు విద్యార్థులకు, పేదలకు తాము ఉన్నామంటూ చేస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. అంతేకాకుండా కళ్యాణ మండపం ద్వారా వచ్చే ఆదాయం కూడా పేదలకు ఖర్చు చేస్తామని ప్రకటించడం వారి ఔదార్యానికి, సేవా గుణానికి నిదర్శనమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పెదనాటి వెంకటేశ్వరరావు, సెక్రటరీ వేమూరి సురేశ్, పిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మాజీ డిసిసిబి చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లీశ్వరి, విద్యుత్ ఎస్ఈ శ్రీనివాస్, స్థానిక కౌన్సిలర్ కందుల చంద్రశేఖర్, నాయకులు మహబూబ్ జానీ, గన్న చంద్రశేఖర్, ముత్యాలు, ఓరుగంటి ప్రభాకర్, చింతల పార్టీశ్రీనివాస్, భరత రెడ్డి, వీరారెడ్డి, రావెళ్ల సీతారామయ్య, పోటు రంగారావు, బాలకృష్ణ, డాక్టర్ సుబ్బారావు, గంట సత్యనారాయణ, కనగాల నాగేశ్వరరావు, పైడిమర్రి సత్తిబాబు పాల్గొన్నారు.

# ఫాం పాండ్‌ల నిర్మాణాలతో భూగర్భ జలాలు పెంపు : జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

ఆదిలాబాద్, జులై 23:రైతులు తమ పంట క్షేత్రాలలో ప్రతి వర్షపు చుక్కను ఒడిసి పట్టేందుకుగాను ఫామ్ పాండ్ల ను నిర్మించుకోవాలని కలెక్టర్ భవేష్ మిశ్రా పిలుపునిచ్చారు. నిర్మల్ జిల్లా కుభీర్ మండలం డోడర్న గిరిజన గ్రామంలో గురువారం ఆయన అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి గోరేఖ సంతోష్ సాగర రైతు క్షేత్రంలో ఫాం పాండ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో ప్రస్తుత పరిస్థితుల్లో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్నందున ప్రతి నీటిబొట్టును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు తమ పంట క్షేత్రాలు, బోరు బావుల వద్ద ఇంకుడు గుంతలను నిర్మించుకుని భూగర్భ జలాల పెంపునకు నడుం బిగించాలని అన్నారు.

ఫాం పాండ్ల నిర్మాణానికి ముందుకు వచ్చిన రైతు దంపతులను శాలువాతో సత్కరించారు. భూగర్భ జలాల పెరుగుదలకు మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో విజయలక్ష్మి, ఎంపీడీవో అక్కల్దేవి శ్రీనివాస్, ఏపీడీ ప్రసాద్, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీవో భీమేష్, ఏపీవో రాథోడ్ హరిలాల్, టీఏలు, ఆయా శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

# దేశాభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకం

## -బి.ఎం.ఎస్.ఆర్.యు. రాష్ట్ర అధ్యక్షులు పప్పుల సురేష్



కరీంనగర్, జులై 23: (నేటినిజం ప్రతినిధి) కార్మిక శక్తియే నిజమైన జాతీయ శక్తి అని, కార్మికులంతా అంకితభావంతో, దేశభక్తితో విధులను నిర్వర్తించాలని భారతీయ వైద్య విక్రయ ప్రతినిధుల యూనియన్ (బి.ఎం.ఎస్.ఆర్.యు.) రాష్ట్ర అధ్యక్షులు పప్పుల సురేష్ పిలుపునిచ్చారు.బి.ఎం.ఎస్. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక అంబేద్కర్ నగర్ కూడలిలో బి.ఎం.ఎస్.ఆర్.యు. ఆధ్వర్యంలో ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షులు పప్పుల సురేష్ జెండా ఆవిష్కరించి, యూనియన్ సిద్ధాంతాలను కార్యకర్తలకు వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో కార్మిక వర్గం పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. ఏ రంగానికి చెందిన కార్మికులైనా దేశభక్తితో పనిచేస్తేనే ఆ అభివృద్ధి ఫలాలు సమాజానికి అందుతాయన్నారు."దేశం బాగుంటే పరిశ్రమ బాగుంటుంది, పరిశ్రమ బాగుంటే కార్మికుడు బాగుంటాడు" అనే చక్రంలా ఈ వ్యవస్థ సాగుతుందని, అప్పుడే దేశం ప్రగతి పథంలో పయనిస్తుందని వివరించారు.రాజకీయాలకు అతీతంగా, ప్రత్యేక సిద్ధాంతాలతో పనిచేస్తున్న భారతీయ కార్మిక సంఘం (బి.ఎం.ఎస్.) ప్రపంచంలోనే అతిపెద్ద కార్మిక సంఘంగా అవతరించిందని పేర్కొన్నారు. ఇటువంటి గొప్ప సంఘంలో కార్యకర్తలుగా కొనసాగడం ప్రతి ఒక్కరికీ గర్వకారణమన్నారు.ఈ కార్యక్రమంలో బి.ఎం.ఎస్. జిల్లా అధ్యక్షులు పసుల శ్రవణ్, కార్యదర్శి తొర్తి శ్రీనివాస్, బి.ఎం.ఎస్.ఆర్.యు. జిల్లా నాయకులు ఆముదుర్తి రవి, క్యాతం శ్రీనివాస్, నల్ల నవీన్, గోవిందుల సతీష్, మాదాసు విక్రమ్, వెంకటరమణ, సుల్తాన్, నక్క అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్‌కు మద్దతుగా కాంగ్రెస్ నిరసన

## - వేములవాడలో రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన



రాజన్న సిరిసిల్ల, జులై 23:(నేటినిజం ప్రతినిధి): టీపీసీసీ పిలుపు మేరకు లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి సంఘీభావంగా వేములవాడ తిప్పాపురంలోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూమ్ మధు, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ ఢిల్లీలో రాహుల్ గాంధీపై జరిగిన దాడిని ఖండించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకుడి స్వేచ్ఛను హరించే చర్యలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు.నెహ్రూ గాంధీ కుటుంబం దేశాభివృద్ధికి విశేష సేవలు అందించిందని, రాహుల్ గాంధీ రైతులు, యువత, మహిళలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడుతున్నారని తెలిపారు. ప్రజల తరఫున ప్రశ్నించే స్వరాన్ని అణచివేయాలనే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించిన వారు, ప్రజాస్వామ్యాన్ని ఎవరూ అణచలేరని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య, రాజ్యాంగ, లౌకిక విలువల పరిరక్షణకు కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.